తొలివెలుగు జాతీయపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 9491134365

TGTEL/26/A6221

తొలివెలుగు

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం.. జాతీయపత్రిక

TOLE VELUGGU JATIYAPATRIKA

విలేకరులు కావలెను

తొలివెలుగు జాతీయపత్రికలో పనిచేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9491134365

యాదాద్రిభువనగిరి	సంపుటి: 01	సంచిక.56	మంగళవారం	22.సెప్టెంబర్.2026	ఎడిటర్: యంజాల ప్రవీణ్	పేజీలు: 8	వేల రూ. 2/
Yadadri Bhuvangiri	Volume: 01	Issue.56	Tuesday	22.9.2026	Editor: Yamjala Praveen	pages: 8	cost. 2/

సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.813 కోట్లు

పరిహారం చెల్లింపుల్లో జాప్యం వద్దు

- మార్కెట్ విలువకు చేరువగా పరిహారం ఉండాలి
- యుద్ధప్రాతిపదికన పంపిణీకి ఉత్తమ్ ఆదేశం
- భూసేకరణకు రూ.6 వేల కోట్లపై సీఎం హామీ

హైదరాబాద్, సెప్టెంబర్ 21 : సాగునీటి ప్రాజెక్టుల కోసం భూములు ఇచ్చిన రైతులకు చెల్లించాల్సిన పరిహారాన్ని ఏమాత్రం ఆలస్యం చేయకుండా అందించాలని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. భూసేకరణ, పునరావాసం-పునర్వ్యవస్థీకరణ కోసం ఇప్పటికే విడుదలైన నిధుల్లో జిల్లా స్థాయిలో పెండింగ్‌లో ఉన్న రూ.813 కోట్లను యుద్ధప్రాతిపదికన రైతుల చేతికి చేర్చాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఖాతాల్లో డబ్బు ఉండి.. పరిహారం అందక ప్రాజెక్టుల పనులు నిలిచిపోవడాన్ని సహించబోమని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్లతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా భూసేకరణ, పరిహారం చెల్లింపుల పురోగతిని ఉత్తమ్ సమీక్షించారు. ఏప్రిల్ 1 నుంచి భూసేకరణ, పునరావాసానికి సంబంధించి సుమారు రూ.3,101 కోట్ల విలువైన టోకెన్లు సమర్పించగా, రూ.2,504 కోట్ల మేర నిధులు విడుదల చేసినట్లు అధికారులు వివరించారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న మొత్తంలో భూసేకరణ అధికారుల వద్ద రూ.502 కోట్లు, కలెక్టర్ల వద్ద రూ.311 కోట్లు ఉన్నట్లు సమావేశంలో వెల్లడైంది. భూములు కోల్పోయిన రైతులకు నిధులు చేరకుండా ప్రభుత్వ ఖాతాల్లోనే ఉండిపోవడం ఆందోళనకరమని ఉత్తమ్

వివరాలు 2లో..

ఎల్‌నినో యాక్షన్ ప్లాన్‌పై అక్టోబర్ 2న తీర్మానాలు

- ప్రతి గ్రామ పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దాలి
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

2

రాయదుర్గంలో ఇందిరమ్మ టవర్స్

వచ్చే బోనాల నాటికి లబ్ధిదారులతో బోనాలు ఎత్తిస్తాం

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక..
- ఉచితంగా రిజిస్ట్రేషన్ హక్కులు
- ప్రతి నియోజకవర్గంలో ఇండ్ల నిర్మాణ పనులు

2



హైదరాబాద్ మహానగరంలోని 'క్యూర్' పరిధిలో నివసిస్తున్న పట్టణ పేదల సొంతింటి కలను సాకారం చేసే దిశగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరో చారిత్రాత్మక ఘట్టానికి శ్రీకారం చుట్టింది. శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని రాయదుర్గం మల్కం చెరువు సమీపంలో ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ నిర్మాణ పనులకు రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పలువురు అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల కేటాయింపు పత్రాలను ఆయన పంపిణీ చేశారు.

2

ట్యాంక్‌బండ్‌పై ఉద్రిక్తత

- హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనానికి బారికేడ్లు తొలగించిన ఉత్సవ సమితి
- పోలీసుల ఆంక్షలను వ్యతిరేకించిన భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి
- సంప్రదాయ నిమజ్జనాన్ని అడ్డుకోవడం సరికాదని నేతల ఆగ్రహం
- కాలుష్య నియంత్రణ కోసం ట్యాంక్‌బండ్‌పై పీవోపీ విగ్రహాల నిమజ్జనానికి ఆంక్షలు
- పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు భారీగా పోలీసుల మోహరింపు

వినాయక నిమజ్జనోత్సవాల వేళ ట్యాంక్‌బండ్‌పై మరోసారి ఉద్రిక్తత నెలకొంది. హుస్సేన్‌సాగర్‌లో విగ్రహాల నిమజ్జనాన్ని అడ్డుకునేందుకు పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులు ఏర్పాటు చేసిన ఇనుప బారికేడ్లను భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సభ్యులు తొలగించారు.

వివరాలు 2వ పేజీలో

డ్రగ్స్‌పై దేశవ్యాప్త ఉక్కుపాదం

- ఢిల్లీలో మూడో జాతీయ ఏఎన్‌టీఎఫ్ సదస్సు
- నేడు ప్రారంభించనున్న అమిత్ షా
- 36 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల చీఫ్‌ల హాజరు
- డ్రగ్ కార్టెల్స్ ఛేదింపుపై ప్రత్యేక దృష్టి
- డార్క్‌నెట్, క్రిప్టో లావాదేవీలపైనా చర్చ

2



బాలికపై వేధింపులు ముగ్గురి అరెస్టు

- పదో తరగతి విద్యార్థులకు వేధింపులు
- వైరల్ వీడియోతో రంగంలోకి దిగిన పోలీసులు
- పోక్సో సహా పలు సెక్షన్ల కింద కేసు
- ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు
- కఠిన చర్యలు తీసుకోవాలన్న రాహుల్ గాంధీ

2

2

జూరాల ఎడమ కాలువ వద్ద ఉద్రిక్తత

పోలీసుల లాఠీఛార్జ్, మాజీ ఎమ్మెల్యే చిట్టెం అరెస్టు

పంటలను కాపాడుకునేందుకు కాలువలోకి దిగి రైతుల ఆందోళన

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా సాగునీటి పోరాటం

22ఏ నిషేధిత జాబితా వివాదం

- ప్రభుత్వానికి ఎన్‌హెచ్‌ఆర్సీ నోటీసులు
- ప్రైవేట్ భూములను నిషేధిత జాబితాలో చేర్చడంపై స్వతంత్ర విచారణకు ఆదేశం
- నాలుగు వారాల్లో సమగ్ర నివేదిక సమర్పించాలని సీఎస్‌కు స్పష్టీకరణ

2

మూసీలోకి దూసుకెళ్లిన స్కూల్ బస్సు

విద్యార్థులకు తప్పిన ముప్పు

2

రామ మందిర విరాళాల చోరీ నిందితుల గుర్తింపు

- దర్యాప్తు దాదాపు పూర్తి చేసిన సిట్
- 25లోగా తొలి చార్జిషీట్ దాఖలు
- సీసీటీవీలో 105 చోరీ ఘటనలు
- ఇప్పటికేఎనిమిది మంది అరెస్టు

2

ట్యాంక్‌బండ్‌పై ఉద్రిక్తత

హైదరాబాద: వినాయక నిమజ్జనోత్సవాల వేళ ట్యాంక్‌బండ్‌పై మరోసారి ఉద్రిక్తత నెలకొంది. హుస్సేన్‌సాగర్‌లో విగ్రహాల నిమజ్జనాన్ని అడ్డుకునేందుకు పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులు ఏర్పాటు చేసిన ఇనుప బారికేడ్లను భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సభ్యులు తొలగించారు. అనంతరం శోభాయాత్రగా వచ్చిన పలువురు హుస్సేన్‌సాగర్‌లో విగ్రహాలను నిమజ్జనం చేయడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. శతాబ్దాలుగా కొనసాగుతున్న నిమజ్జన సంప్రదాయాన్ని నిలిపివేయడం ద్వారా భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిమజ్జనానికి అడ్డుగా ఏర్పాటు చేసిన ఇనుప గ్రిల్స్, బారికేడ్లను తొలగించారు. నిమజ్జనోత్సవాల చివరి ఘట్టం సజావుగా సాగేందుకు ట్యాంక్‌బండ్‌పై ఆంక్షలను ఎత్తివేసి వాహనాలను అనుమతించాలని డిమాండ్ చేశారు. హుస్సేన్‌సాగర్‌లో కాలుష్యాన్ని తగ్గించేందుకు తెలంగాణ హైకోర్టు గతంలో పలు ఆదేశాలు జారీ చేసింది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనం చేయకుండా చర్యలు తీసుకోవాలని, పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి విగ్రహాలకు మాత్రమే అనుమతి ఇవ్వాలని స్పష్టం చేసింది. ఇతర విగ్రహాలను బేబీ పాండ్స్, ఎన్టీఆర్ మార్గ్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన నిమజ్జన కేంద్రాల వైపు తరలించాలని సూచించింది. ఈ నేపథ్యంలోనే ట్యాంక్‌బండ్ ప్రధాన రహదారి నుంచి హుస్సేన్‌సాగర్‌లోకి విగ్రహాలను తీసుకెళ్లకుండా అధికారులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఉత్సవ సమితి నేతలు బారికేడ్లను తొలగించడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ట్యాంక్‌బండ్ పరిసరాల్లో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌తో పాటు అదనపు పోలీసు బలగాలను మోహరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టారు. కోర్టు ఆదేశాలు, ప్రభుత్వ సూచనలను పాటించాలని, నిబంధనలు ఉల్లంఘించవద్దని పోలీసులు ఉత్సవ సమితి నేతలకు సూచించారు.

ఎల్‌నినో యాక్షన్ ప్లాన్‌పై అక్టోబర్ 2న తీర్మానాలు

హైదరాబాద్: ఎల్‌నినో ప్రభావంతో రానున్న కాలంలో ఎదురయ్యే పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు గ్రామస్థాయిలో పటిష్టమైన కార్యాచరణ రూపొందించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. ఖైరతాబాద్‌లోని పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖపై సోమవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. అక్టోబర్ 2న నిర్వహించనున్న గ్రామ సభలు, ఎల్‌నినో నేపథ్యంలో గ్రామాల వారీగా చేపట్టాల్సిన పనులు, పంచాయతీల్లో అమలు చేయాల్సిన అభివృద్ధి ప్రణాళికపై మంత్రి సమీక్షించారు. సమావేశానికి స్పెషల్ సీఎస్ దానకిషోర్, అడిషనల్ కమిషనర్ పి.రవీందర్‌తోపాటు శాఖకు చెందిన ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని యాక్షన్ ప్లాన్‌పై అసెంబ్లీలో చర్చించి తీర్మానం చేశామని చెప్పారు. అక్టోబర్ 2న ప్రతి గ్రామ పంచాయతీలో నిర్వహించే గ్రామ సభల్లో ఎల్‌నినో యాక్షన్ ప్లాన్‌పై చర్చించి గ్రామస్థాయిలో అవసరమైన చర్యలపై తీర్మానాలు చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామానికి అవసరమైన పనులు ఏమిటి.. అందుబాటులో ఉన్న నిధులు ఎంత.. వచ్చే ఏడాది కాలంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ద్వారా గ్రామ పంచాయతీలకు అందే నిధులు ఎంత అనే అంశాలపై గ్రామ సభల్లో సమగ్రంగా చర్చించి గ్రామ అవసరాలకు అనుగుణంగా కార్యాచరణను ఆమోదించాలని మంత్రి సూచించారు.

మూసీలోకి దూసుకెళ్లిన బస్సు

హైదరాబాద్ : రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో స్కూల్ బస్సు అదుపుతప్పి మూసీ నదిలోకి దూసుకెళ్లిన సంఘటన సోమవారం జరిగింది. దీంతో బస్సులోని చిన్నారులు, స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. త్రుటిలో పెను ప్రమాదం తప్పడంతో చిన్నారుల తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు, సంబంధిత అధికారులు ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. స్కూల్ బస్సు రోడ్డుపై నుంచి అదుపుతప్పి మూసీ నదిలోకి దూసుకెళ్లడంతో ఆ మార్గంలో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. బస్సును అక్కడి నుంచి తొలగించేందుకు చర్యలు చేపట్టడంతోపాటు ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. డ్రైవర్ నిర్లక్ష్యమా లేక మరేదైనా కారణమా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు.

డ్రగ్స్‌పై దేశవ్యాప్త ఉక్కుపాదం

న్యూఢిల్లీ : దేశంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగానికి అడ్డుకట్ట వేసే దిశగా కేంద్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేస్తోంది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల యాంటీ నార్కోటిక్స్ టాస్క్‌ఫోర్స్ చీఫ్‌ల మూడో జాతీయ సదస్సును సెప్టెంబర్ 22, 23 తేదీల్లో ఢిల్లీలో నిర్వహించనుంది. రెండు రోజుల సదస్సును కేంద్ర హోంమంత్రి అమిత్ షా మంగళవారం ప్రారంభించనున్నారు. మొత్తం 36 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ఏఎన్‌టీఎఫ్ చీఫ్‌లతోపాటు సంబంధిత కేంద్ర ప్రభుత్వ విభాగాలు, ఇతర భాగస్వామ్య సంస్థల ప్రతినిధులు పాల్గొంటారు. 'సమష్టి సంకల్పం-ఉమ్మడి బాధ్యత' ఇతివృత్తంతో జరిగే ఈ సదస్సులో 2026-29 నార్కోటిక్స్ కంట్రోల్ విజన్ డాక్యుమెంట్‌లో నిర్దేశించిన లక్ష్యాల అమలును సమీక్షించనున్నారు. మాదకద్రవ్యాల సరఫరాను తగ్గించడం, వినియోగాన్ని నిరోధించడం, వాటివల్ల కలిగే నష్టాన్ని తగ్గించడం, కేంద్ర-రాష్ట్ర దర్యాప్తు సంస్థల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడంపై ప్రధానంగా చర్చించనున్నారు. దేశీయ, అంతర్జాతీయ డ్రగ్ కార్టెల్స్ నెట్‌వర్క్‌లను గుర్తించి ఛేదించడం, కొత్త రకాల సింథటిక్ డ్రగ్స్‌ను నియంత్రించడం, వాటి తయారీకి ఉపయోగించే రహస్య ప్రయోగశాలలను గుర్తించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. అక్రమ సాగును నిర్మూలించడం, ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించడం సహా మొత్తం ఎనిమిది సాంకేతిక సమావేశాలను నిర్వహించనున్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని సాగుతున్న మాదకద్రవ్యాల అక్రమ వ్యాపారం కూడా సదస్సులో కీలక అంశం కానుంది. డార్క్‌నెట్ ద్వారా డ్రగ్స్ విక్రయాలు, క్రిప్టోకరెన్సీలతో జరిగే లావాదేవీలను గుర్తించడం, వాటిపై సమర్థంగా దర్యాప్తు చేయడం, డ్రగ్ నెట్‌వర్క్‌ల ఆర్థిక మూలాలను ఛేదించే వ్యూహాలపై చర్చించనున్నారు. సదస్సు ప్రారంభోత్సవం సందర్భంగా లఖ్‌నవూ, డెహ్రాడూన్‌లలో ఏర్పాటు చేయనున్న నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో జోనల్ సముదాయాలకు అమిత్ షా శంకుస్థాపన చేయనున్నారు. మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కోసం రూపొందించిన ప్రచార చిత్రాలను విడుదల చేయడంతోపాటు పునరుద్ధరించిన ఎన్‌సీబీ వెబ్‌సైట్‌ను ప్రారంభించనున్నారు. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో అత్యుత్తమ పనితీరు కనబరిచిన ఏఎన్‌టీఎఫ్‌ను సదస్సులో సత్కరించనున్నారు. మాదకద్రవ్యాలపై పోరులో నిఘా, దర్యాప్తు, సమాచార మార్పిడి, పునరావాసం, వివిధ సంస్థల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసి 'డ్రగ్ ఫ్రీ ఇండియా' లక్ష్యం దిశగా కార్యాచరణను వేగవంతం చేయడం ఈ సదస్సు ప్రధాన ఉద్దేశమని కేంద్ర హోంశాఖ తెలిపింది.

సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.813 కోట్లు

మొదటి పేజీ తరువాయి

పేర్కొన్నారు. కలెక్టర్లు వ్యక్తిగతంగా జోక్యం చేసుకుని చర్చలు వేగవంతం చేసి అవార్డులు, పరిహారం చెల్లింపులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఏదైనా వాస్తవమైన కారణంతో నిధులు చెల్లించలేని పరిస్థితి ఉంటే కారణాన్ని వివరించి డబ్బును తిరిగి ప్రభుత్వానికి పంపాలని, ఖాతాల్లో నిరుపయోగంగా ఉంచవద్దని స్పష్టం చేశారు. 2026లో సాగునీటి ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, పునరావాసం, అటవీ సంబంధిత అవసరాల కోసం రూ.6 వేల కోట్లు సమకూర్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని ఉత్తమ్ తెలిపారు. ప్రాధాన్య ప్రాజెక్టులకు నిధుల కొరత అడ్డంకి కాకుండా సాధారణ నీటిపారుదల బడ్జెట్‌కు వెలుపల నుంచి ఈ నిధులను సమకూరుస్తున్నట్లు వివరించారు.

రైతులకు అన్యాయం జరగొద్దు

భూసేకరణలో రైతుల పట్ల మానవీయంగా వ్యవహరించాలని ఉత్తమ్ స్పష్టం చేశారు. అవార్డులు ఖరారై, చెల్లింపులకు సిద్ధంగా ఉన్న కేసుల్లోనే టోకెన్లు రూపొందించాలని సూచించారు. చట్టపరమైన నిబంధనలు, ప్రక్రియలకు లోబడి రైతులకు ఇచ్చే పరిహారం సాధ్యమైనంత వరకు ప్రస్తుత మార్కెట్ విలువకు చేరువగా ఉండాలని చెప్పారు. అవార్డు తర్వాత కూడా పరిహారం చెల్లించని కేసుల్లో నిబంధనల ప్రకారం వర్తించే వడ్డీని చెల్లించాలని ఆదేశించారు. కోర్టు, యాజమాన్య వివాదాల్లో ఉన్న కేసులన్నింటినీ క్రోడీకరించి అడ్వకేట్ జనరల్ ద్వారా పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. నల్లగొండ, యాదాద్రి భువనగిరి, నారాయణపేట, సిద్దిపేట, వికారాబాద్, జగిత్యాల, హనుమకొండ సహా పలు జిల్లాల్లో భూసేకరణకు ఎదురవుతున్న అడ్డంకులను మంత్రి సమీక్షించారు. నల్లగొండ జిల్లాలో చింతపల్లి రిజర్వాయర్, పెండ్లిపాక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, ఉదయసముద్రం, నెల్లికల్లు పనుల పురోగతిపై ఆరా తీశారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం పూర్తయినా పెండ్లిపాక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు అవసరమైన భూసేకరణ పూర్తికాకపోతే పెట్టుబడుల ప్రయోజనం అందదని హెచ్చరించారు. పలు సాగునీటి ప్రాజెక్టులు ఇప్పటికే గణనీయంగా పూర్తయినా డిస్ట్రిబ్యూటరీ కాలువలు, అనుసంధాన పనులు, కొద్దిపాటి భూసేకరణ పెండింగ్‌తో వాటి ఫలాలు రైతులకు అందడం లేదని ఉత్తమ్ పేర్కొన్నారు. రెండు, మూడు వారాలు సాధారణ పరిపాలనా సమయమంటూ జాప్యం చేయకుండా గడువులను కుదించి పనులు పూర్తి చేయాలని కలెక్టర్లకు సూచించారు. నిధుల అవసరం ఉన్నప్పుడు, చెల్లింపులకు కేసులు సిద్ధమైన తర్వాతే కోరాలని.. ప్రభుత్వ సొమ్ము ఖాతాల్లో నిరుపయోగంగా ఉండకుండా ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సూచించారు. సమీక్షలో మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్‌రాజ్, ఆర్థిక శాఖ కార్యదర్శి సందీప్ సుల్తానియా, భూసేకరణ కమిషనర్ శివకుమార్ నాయుడు, జిల్లా కలెక్టర్లు పాల్గొన్నారు.

రాయదుర్గంలో ఇందిరమ్మ టవర్స్

హైదరాబాద: హైదరాబాద్ మహానగరంలోని పట్టణ పేదల సొంతింటి కలను సాకారం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని రాయదుర్గం-మల్కం చెరువు సమీపంలో చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల టవర్స్‌కు రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. పట్టణ పేదలను నగరానికి దూరంగా పంపకుండా వారు నివసిస్తున్న ప్రాంతాలకు సాధ్యమైనంత దగ్గరలోనే సొంతింటిని అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు. పేదవాడి సొంతింటి కల అంటే కేవలం నాలుగు గోడలు, పైకప్పు కాదని.. ఆత్మగౌరవంతో జీవించే చిరునామా కల్పించడమే ఇందిరమ్మ టవర్స్ లక్ష్యమని పొంగులేటి చెప్పారు. హైదరాబాద్‌లో భూముల ధరలు అత్యధికంగా ఉన్న ప్రాంతాల్లోనే పేదలకు ఇళ్లు నిర్మించి భద్రత, భరోసా కల్పిస్తున్నామన్నారు. రాయదుర్గం ప్రాజెక్టును 2.85 ఎకరాల విస్తీర్ణంలో చేపడుతున్నట్లు వెల్లడైంది. ఇందిరమ్మ టవర్స్‌లో ఇల్లు పొందే ప్రతి కుటుంబానికి అపార్ట్‌మెంట్‌పై పూర్తి హక్కులతోపాటు 17 నుంచి 20 గజాల వరకు అవిభాజ్య భూవాటా కల్పిస్తామని మంత్రి తెలిపారు. సేల్‌డీడ్‌ను రిజిస్ట్రేషన్ చార్జీలు లేకుండా అందించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు చెప్పారు. ఇది కేవలం నివాసం మాత్రమే కాదని, పిల్లలకు, భవిష్యత్ తరాలకు మిగిలే ఆస్తి అని పేర్కొన్నారు. లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యం, పైరవీలకు అవకాశం ఉండదని పొంగులేటి స్పష్టం చేశారు. అర్హత ఆధారంగా లాటరీ పద్ధతిలో పారదర్శకంగా ఎంపిక చేస్తున్నామని చెప్పారు. తెలంగాణ హౌసింగ్ బోర్డు లాటరీ ఎంపికలను బహిరంగంగా ప్రకటించి అభ్యంతరాలు స్వీకరించే విధానాన్ని అమలు చేస్తోందన్నారు. తొలి విడతలో ఒక్కో నియోజకవర్గంలో 480 ఇళ్ల చొప్పున నిర్మాణాలు చేపడుతున్నామని, పలుచోట్ల టెండర్లు, ఒప్పంద ప్రక్రియలు ఇప్పటికే పూర్తయ్యాయని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో తొలి దశలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి ఒక్కో ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని, రెండో దశలో మరో 2.50 లక్షల ఇళ్లను మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. హైదరాబాద్ పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా టవర్స్ కార్యక్రమాన్ని చేపట్టామని చెప్పారు. రాబోయే రెండున్నరేళ్లలో 'క్యూర్' ప్రాంతంలోని అర్హులైన పేదలకు రెండో, మూడో, నాలుగో, ఐదో విడతలుగా ఇళ్లు అందిస్తామని హామీ ఇచ్చారు. రాయదుర్గం ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసి వచ్చే బోనాల నాటికి ఇక్కడి నుంచే లబ్ధిదారులతో బోనాలు ఎత్తించేలా పనులు చేపడతామని పొంగులేటి చెప్పారు. నిర్మాణ నాణ్యతలో రాజీపడబోమని స్పష్టం చేశారు. లబ్ధిదారులు వారానికి ఒకసారి వచ్చి తమ ఇళ్ల నిర్మాణాన్ని స్వయంగా పరిశీలించవచ్చుని, లోపాలు కనిపిస్తే అక్కడే అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. వాటిని పరిష్కరించే బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. గతంలో పేదలకు నగరానికి 30-40 కిలోమీటర్ల దూరంలో ఇళ్లు నిర్మించారని పొంగులేటి విమర్శించారు. తమ ప్రభుత్వం మాత్రం ఖరీదైన ప్రాంతాల్లోనే పేదలకు సొంతింటి హక్కు కల్పిస్తోందన్నారు. పేదల ఇళ్ల కార్యక్రమాన్ని రాజకీయ విమర్శలకు ఉపయోగించడం సరికాదని, గత ప్రభుత్వ హామీలు, అమలుపై ప్రజలే నిర్ణయం తీసుకున్నారని వ్యాఖ్యానించారు.

జూరాల ఎడమ కాలువ వద్ద ఉద్రిక్తత

మహబూబ్‌నగర్: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సాగునీటి కోసం అన్నదాతలు చేస్తున్న పోరాటం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఎండిపోతున్న పంటలను కాపాడుకోవడానికి జూరాల ప్రాజెక్టు ఎడమ కాలువకు వెంటనే నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు చేపట్టిన ఆందోళన మంగళవారం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. అమరచింత మండల పరిధిలోని జూరాల ఎడమ కాలువ వద్దకు రైతులు చేరుకోకుండా పోలీసులు భారీగా మొహరించి అడుగడుగునా అడ్డుకున్నారు.

పోలీసుల లాఠీఛార్జ్ - మాజీ ఎమ్మెల్యే అరెస్టు

రైతుల నిరసనకు మద్దతుగా జూరాల ప్రాజెక్టు వద్దకు చేరుకున్న మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్ రెడ్డిని పోలీసులు అడ్డుకోవడంతో తీవ్ర తోపులాట జరిగింది. పోలీసులు చిట్టెం రాంమోహన్ రెడ్డిని ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో ఆగ్రహించిన రైతులను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీఛార్జ్ చేయడంతో పరిస్థితి చేయిదాటింది. పోలీసులు ప్రధాన రహదారులపై అడ్డంకులు ఏర్పాటు చేసినప్పటికీ, అన్నదాతలు పొలాల వెంబడి కిలోమీటర్ల మేర నడుచుకుంటూ ప్రాజెక్టు వద్దకు చేరుకున్నారు.పంట పొలాలకు నీళ్లు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పలువురు రైతులు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సమాంతర కాలువలోకి దిగి, జూరాల ఎడమ కాలువ రెగ్యులేటర్ వైపు నడుచుకుంటూ వెళ్లేందుకు ప్రయత్నించడం స్థానికులను తీవ్రంగా కలచివేసింది. ఆందోళన తీవ్రతరం కావడంతో రక్షణ చర్యల్లో భాగంగా పోలీస్ బలగాలు జూరాల ప్రాజెక్టును పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. ఆందోళనలకు పిలుపునిచ్చిన ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకులు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలను జిల్లా వ్యాప్తంగా ఎక్కడికక్కడే ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు.

ఒక్క జూరాల మాత్రమే కాకుండా కోయిల్ సాగర్, సంగంబండ రిజర్వాయర్ల కాలువలకు కూడా వెంటనే సాగునీరు విడుదల చేయాలని రైతులు పట్టుబడుతున్నారు. శ్రీశైలం ప్రాజెక్టులో దాదాపు 100 టీఎంసీల నీరు అందుబాటులో ఉన్నప్పటికీ ప్రభుత్వం ఎత్తిపోయకపోవడం వల్ల ఆ నీరంతా దిగువన ఆంధ్ర ప్రాంతానికి తరలిపోతోందని, స్థానిక రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆందోళనకారులు మండిపడుతున్నారు. ఇరిగేషన్ అధికారులు తక్షణమే స్పందించి సాగునీటి విడుదలపై స్పష్టమైన ప్రకటన చేయకపోతే ఆందోళనలను మరింత తీవ్రతరం చేస్తామని రైతాంగం హెచ్చరించింది.

22ఏ నిషేధిత జాబితా వివాదం

హైదరాబాద్: తెలంగాణలో రిజిస్ట్రేషన్ చట్టం పరిధిలోని '22ఏ' నిషేధిత జాబితాలో ప్రైవేట్ వ్యక్తుల భూములను, పట్టా స్థలాలను చేర్చిన వ్యవహారంపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్సీ) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ అంశంపై తక్షణమే స్వతంత్ర విచారణ చేపట్టి, బాధితులకు ఉపశమనం కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని సోమవారం ఆదేశించింది. విచారణ పురోగతి, తీసుకున్న చర్యలపై నాలుగు వారాల్లోగా సమగ్ర నివేదికను సమర్పించాలని స్పష్టం చేసింది.

రాజ్యాంగ హక్కుల ఉల్లంఘనపై ఫిర్యాదు:

హైదరాబాద్‌కు చెందిన న్యాయవాది, సామాజికవేత్త కారు-పోతుల రేవంత్ సెప్టెంబర్ 14న దాఖలు చేసిన ఫిర్యాదుపై ఎన్‌హెచ్‌ఆర్సీ స్పందించింది. ధరణి పోర్టల్ నుంచి నూతన 'భూ భారతి' విధానానికి మార్పు చెందే క్రమంలో, ఎలాంటి ముందస్తు నోటీసులు లేదా గెజిట్ నోటిఫికేషన్లు లేకుండానే లక్షలాది ప్రైవేట్ పట్టా భూములను అధికారులు ఏకపక్షంగా 22ఏ నిషేధిత జాబితాలో చేర్చారని ఫిర్యాదుదారు పేర్కొన్నారు. దీనివల్ల ఆస్తుల రిజిస్ట్రేషన్లు, బ్యాంక్ రుణాలు, భూ లావాదేవీలు నిలిచిపోయి సామాన్య ప్రజలు తీవ్ర ఆర్థిక నష్టంతో పాటు మానసిక క్షోభ అనుభవిస్తున్నారని ఎన్‌హెచ్‌ఆర్సీ దృష్టికి తీసుకెళ్లారు. ఫిర్యాదును పరిశీలించిన కమిషన్.. ప్రజల జీవించే హక్కు (ఆర్టికల్ 21), సమానత్వ హక్కు (ఆర్టికల్ 14), వృత్తి-వ్యాపార నిర్వహణ హక్కు ఆర్టికల్ 19(1)(జీ)రి మరియు ఆస్తి హక్కు (ఆర్టికల్ 300-ఏ) వంటి ప్రాథమిక, రాజ్యాంగ హక్కుల ఉల్లంఘన కోణంలో ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించింది. ప్రైవేట్ వ్యక్తుల భూములు ఈ నిషేధిత జాబితాలోకి ఎలా వచ్చాయి? నిర్ణయాత్మక ప్రక్రియలో అధికారుల వైపు నుంచి ఏమైనా లోపాలు లేదా అక్రమాలు చోటుచేసుకున్నాయా? అనే అంశాలపై నిష్పాక్షికంగా విచారణ జరపాలని ఎన్‌హెచ్‌ఆర్సీ ఆదేశించింది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం 22ఏ సమస్యల పరిష్కారానికి ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసి, జిల్లాల కలెక్టర్లకు దిశానిర్దేశం చేసినప్పటికీ, తాజా ఎన్‌హెచ్‌ఆర్సీ ఆదేశాలతో ఈ ప్రక్రియపై తక్షణ విచారణ నిర్వహించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

రామ మందిర విరాళాల చోరీ నిందితుల గుర్తింపు

న్యూఢిల్లీ: అయోధ్య రామ మందిరంలో భక్తులు సమర్పించిన విరాళాల చోరీ కేసు దర్యాప్తు కీలక దశకు చేరుకుంది. ఈ వ్యవహారంలో ప్రమేయం ఉన్న వారిని గుర్తించామని, దర్యాప్తు దాదాపు పూర్తయిందని ప్రత్యేక దర్యాప్తు బృందం సుప్రీంకోర్టుకు తెలిపింది. సెప్టెంబర్ 25లోగా తొలి చార్జిషీట్‌ను దాఖలు చేయనున్నట్లు వెల్లడించింది. ఇప్పటివరకు ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు వార్తా కథనాలు పేర్కొంటున్నాయి. సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ వ్యవహారంపై విచారణ చేపట్టింది. సిట్ దర్యాప్తు పురోగతికి సంబంధించిన నివేదికను సీల్డ్ కవర్‌లో కోర్టుకు సమర్పించింది. ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వివరాలు వెల్లడించారు. తొలి అరెస్టు నుంచి 90 రోజుల గడువు సెప్టెంబర్ 25తో ముగియనున్నందున, అంతకుముందే చార్జిషీట్ దాఖలు చేయాల్సి ఉందని కోర్టుకు తెలిపారు. దర్యాప్తులో ఆలయ ప్రాంగణంలోని సీసీటీవీ దృశ్యాలను సిట్ క్షుణ్ణంగా పరిశీలించింది.

విరాళాల చోరీకి సంబంధించిన 105 ఘటనలు సీసీటీవీ కెమెరాల్లో నమోదైనట్లు కోర్టుకు సమర్పించిన నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం. సాక్షుల వాంగ్మూలాలు, విరాళాల లెక్కలు, రసీదులు, సంబంధిత పత్రాలు, ఎలక్ట్రానిక్ ఆధారాలను సిట్ సేకరించింది. స్వాధీనం చేసుకున్న నగదు, ఇతర వస్తువులను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లాకర్లలో భద్రపరిచినట్లు నివేదికలు వెల్లడించాయి. ఈ కేసులో దర్యాప్తును వేగంగా పూర్తి చేసి తార్కిక ముగింపునకు తీసుకెళ్లాలని సుప్రీంకోర్టు గతంలోనే ఆదేశించింది. జూలైలో ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటును పరిగణనలోకి తీసుకున్న సర్వోన్నత న్యాయస్థానం, దర్యాప్తు బృందంలో ఫోరెన్సిక్ ఆడిటర్‌ను కూడా చేర్చాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇదిలా ఉండగా శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ తొలి ముఖ్య కార్యనిర్వహణాధికారిగా రిటైర్డ్ ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్ర ఇటీవల నియమితులయ్యారు. ఈ పదవికి మొత్తం 5,585 దరఖాస్తులు రాగా, బహుళ దశల ఎంపిక ప్రక్రియ అనంతరం మిశ్రను ఎంపిక చేసినట్లు ట్రస్ట్ వెల్లడించింది.

బాలికపై వేధింపులు ముగ్గురి అరెస్టు

జాముయ్: బిహార్‌లోని జాముయ్ జిల్లాలో ఇద్దరు పదో తరగతి విద్యార్థులను అడ్డగించి వేధించిన ఘటన తీవ్ర కలకలం రేపింది. బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడడంతోపాటు ఆమె వెంట ఉన్న బాలుడిపైనా దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో పోలీసులు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసి ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. మిగిలిన నిందితుల కోసం గాలింపు కొనసాగుతోంది. సెప్టెంబర్ 19న రాత్రి 7 గంటల సమయంలో ఈ ఘటన జరిగినట్లు జాముయ్ ఎస్పీ విశ్వజీత్ దయాల్ తెలిపారు. ఇద్దరు విద్యార్థులు కోచింగ్‌కు వెళ్లిన అనంతరం ఆ ప్రాంతానికి వెళ్లగా కొందరు వారిని అడ్డుకున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. బాలికతో అసభ్యంగా ప్రవర్తించడంతోపాటు ఆమెను బలవంతంగా తీసుకెళ్లేందుకు ప్రయత్నించినట్లు వైరల్ వీడియోల్లో కనిపించింది. అడ్డుకునేందుకు ప్రయత్నించిన బాలుడిపైనా దాడి జరిగినట్లు పోలీసులు తెలిపారు. బాధితుల గోప్యత దృష్ట్యా వారి వివరాలను వెల్లడించలేదు. బాధితుల వాంగ్మూలాలను నమోదు చేసిన పోలీసులు పోక్సో చట్టంలోని సెక్షన్లు 8, 12తోపాటు భారతీయ న్యాయ సంహితలోని సంబంధిత సెక్షన్ల కింద జాముయ్ సదర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. వీడియోలో ఆరు నుంచి ఏడుగురు కనిపిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఇప్పటివరకు ముగ్గురిని అరెస్టు చేయగా, ఘటనపై సమగ్ర దర్యాప్తు కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ ఘటనను లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రంగా ఖండించారు. బాలిక ఎంతగా వేడుకున్నా ఆమెను వేధించే హక్కు ఎవరికీ లేదని పేర్కొన్నారు. వీడియోలో కనిపించిన ప్రతి ఒక్కరినీ గుర్తించి పోక్సో చట్టం కింద చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలు, బాలికల భద్రతపై బిహార్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని కోరారు. జాతీయ మహిళా కమిషన్ కూడా ఘటనను సుమోటోగా స్వీకరించింది. నిందితులందరినీ గుర్తించి చర్యలు తీసుకోవడంతోపాటు బాధితులకు భద్రత, న్యాయ సహాయం, మానసిక సహకారం అందించాలని బిహార్ పోలీసులను కోరింది. ఘటనకు సంబంధించిన వీడియోను మరింత వ్యాప్తి చేయకుండా చర్యలు చేపట్టాలని సూచించింది.

కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి

- 14వ వర్ధంతి నిర్వహించిన చేనేత సహకార సంఘం
- మంత్రి పదవినీ త్యాగం చేసిన మహనీయుడు: మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు

తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి : తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనే ధ్యేయంగా తొలి, మలి దశ ఉద్యమాల్లో చివరి శ్వాస వరకు పోరాడిన మహనీయుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని భూదాన్ పోచంపల్లి మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు కొనియాడారు. పురపాలక కేంద్రంలో సోమవారం చేనేత సహకార సంఘం ఆధ్వర్యంలో బాపూజీ 14వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తడక వెంకటేశ్వర్లు, సహకార సంఘం అధ్యక్షుడు భారత లవ్‌కుమార్‌తో కలిసి బాపూజీ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ... బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం బాపూజీ నిరంతరం శ్రమించారని గుర్తుచేసారు. ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష కోసం తన మంత్రి పదవిని సైతం త్యాగం చేసిన ధీశాలి అని పేర్కొన్నారు. ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయడమే నిజమైన నివాళి అని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు సీత శ్రీశైలం, ప్రధాన కార్యదర్శి సురపల్లి శ్రీనివాస్, కోశాధికారి కోడి బాలరాజు, మేనేజర్ రుద్ర ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచస్థాయిలో పోచంపల్లి చేనేత కళ

- వస్త్రాల తయారీని పరిశీలించిన తమిళనాడు ఐఏఎస్ అధికారి టీఎన్ వెంకటేష్
- చేనేత సొసైటీ షోరూంలో చీరల కొనుగోలు

తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి : భూదాన్ పోచంపల్లి చేనేత కళాకారుల నైపుణ్యం ప్రపంచ స్థాయి అని తమిళనాడు ప్రిన్సిపల్ సెక్రెటరీ టి.ఎన్. వెంకటేష్ (ఐఏఎస్) కొనియాడారు. తెలంగాణ క్షేత్ర పర్యటనలో భాగంగా సోమవారం ఆయన పురపాలక కేంద్రంలోని టూరిజం చేనేత మ్యూజియంను సందర్శించారు. ఈ సందర్భంగా చేనేత వస్త్రాల తయారీ విధానాలు, ఇకత్ కళారూపాల లఘు చిత్రాన్ని తిలకించి, పలు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చేనేత సహకార సంఘం షోరూమ్‌ను సందర్శించి వస్త్రాలను పరిశీలించి, చీరలను కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర పర్యటనలో భాగంగా ఇప్పటికే నిర్మల్, సిద్దిపేట ప్రాంతాలను సందర్శించానని తెలిపారు. ప్రపంచంలోనే ఎంతో సంక్లిష్టమైన డబుల్ ఇకత్ వస్త్రాలను ఒడిశాతో పాటు ఒక్క పోచంపల్లిలోనే రూపొందించడం ఇక్కడి చేనేత కళాకారుల ప్రతిభకు నిదర్శనమన్నారు. అనంతరం చేనేత సహకార సంఘం అధ్యక్షుడు భారత లవకుమార్ ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చేనేత శాఖ జిల్లా సహాయ సంచాలకులు (ఏడీ) శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి: ఎస్పీ

- తుమ్మలగూడెం చెరువు వద్ద ఏర్పాట్ల పరిశీలన
- భద్రతా చర్యలపై అధికారులకు మార్గదర్శనం

తొలివెలుగు, రామన్నపేట : గణేష్ నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని యాదాద్రి జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం రామన్నపేట మండలంలోని తుమ్మలగూడెం చెరువు వద్ద గణేష్ నిమజ్జనానికి చేపడుతున్న ఏర్పాట్లను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... నిమజ్జన సమయంలో భక్తుల రక్షణకు అత్యధిక ప్రాధాన్యమివ్వాలని, చెరువు పరిసరాల్లో ముందస్తు జాగ్రత్త చర్యలు పాటించాలని సూచించారు. నిమజ్జన మహోత్సవం శాంతియుతంగా పూర్తయ్యేలా సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ డీఎస్పీ మధుసూదన్ రెడ్డి, రామన్నపేట సీఐ మోలుగురి రవి, ఎస్ఐ గోపాతి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నయీం భూములకు '22-ఎ' మినహాయింపు ఎలా?

- తుప్రాన్‌పేటలో 45 ఎకరాల భూములపై కదిలిన ఫైలు
- ఈడీ ఆంక్షలున్న భూములకే రిజిస్ట్రేషన్‌కు మార్గం సుగమం చేశారన్న ఆరోపణలు
- మిగతా 258 ఎకరాల నిషేధిత ఆస్తుల భద్రతపై అనుమానాలు
- వ్యవహారంపై ఉన్నతస్థాయి విచారణ జరపాలని బాధితుల డిమాండ్

తొలివెలుగు, యాదాద్రిభువనగిరి : గ్యాంగ్‌స్టర్ నయీం కేసుతో ముడిపడిన భూముల వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం తుప్రాన్‌పేట పరిధిలోని సర్వే నంబర్లు 12, 13, 14లకు సంబంధించిన సుమారు 45 ఎకరాల భూములను 22-ఎ నిషేధిత జాబితా నుంచి తొలగించినట్లు వస్తున్న ఆరోపణలు అధికార వర్గాల్లో కలకలం రేపుతున్నాయి. ఈ భూములపై కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆంక్షలు ఉన్నప్పటికీ, రిజిస్ట్రేషన్ల కోసం స్లాట్ బుకింగ్ దశ వరకు ఫైలు కదిలిందన్న ప్రచారం ఇప్పుడు తీవ్ర చర్చకు దారితీస్తోంది.

22-ఎ జాబితా నుంచి ఎలా తొలగింపు?

సాధారణంగా నిషేధిత జాబితాలో ఉన్న భూములకు సంబంధించి రికార్డుల్లో మార్పులు చేయాలంటే సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాల్సి ఉంటుంది. అనంతరం నిబంధనల ప్రకారం ఉన్నతాధికారుల పరిశీలన, ఆమోదం అవసరం ఉంటుంది. అయితే తుప్రాన్‌పేట భూముల విషయంలో ఈ ప్రక్రియ ఎలా సాగింది? ఏ అధికారుల స్థాయిలో ఫైలు కదిలింది? ఏ ప్రాతిపదికన 22-ఎ నుంచి మినహాయింపు ఇచ్చారు? అన్న అంశాలు ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారాయి.

ఈడీ ఆంక్షలు ఉన్నా..?

నయీం కేసుతో సంబంధం ఉన్నట్లు పేర్కొంటున్న ఈ భూములపై ఈడీ చర్యలు, ఇతర దర్యాప్తు సంస్థల పరిధి ఉన్న నేపథ్యంలో రికార్డుల నుంచి నిషేధాన్ని తొలగించే విషయంలో మరింత అప్రమత్తత అవసరమని పలువురు అభిప్రాయపడుతున్నారు. అయితే ఆంక్షలు ఉన్న భూములకు సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముందుకు సాగేందుకు ప్రయత్నం జరిగిందన్న ఆరోపణలు రావడం అధికార యంత్రాంగంపై అనుమానాలకు తావిస్తోంది. ఈ వ్యవహారంలో వాస్తవాలు ఏమిటో అధికారిక విచారణలో తేలాల్సి ఉంది.

మిగతా 258 ఎకరాల పరిస్థితేంటి?

జిల్లాలో నయీం కేసుతో ముడిపడి వివిధ దర్యాప్తు సంస్థల పరిధిలో ఉన్న భూములు సుమారు 258 ఎకరాలకు పైగా ఉన్నట్లు సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. హైదరాబాద్‌కు సమీప ప్రాంతాల్లో భూముల ధరలు భారీగా పెరగడంతో ఈ ఆస్తులపై రియల్ ఎస్టేట్ వర్గాల ఆసక్తి కూడా పెరిగిందన్న చర్చ ఉంది. తుప్రాన్‌పేటలోని 45 ఎకరాల వ్యవహారం వెలుగులోకి రావడంతో మిగతా నిషేధిత భూముల రికార్డుల పరిస్థితిపై కూడా సమగ్రంగా పరిశీలన జరపాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి.

బాధితులకు న్యాయం ఎప్పుడు?

నయీం గ్యాంగ్ బెదిరింపులు, వివాదాల కారణంగా తమ భూములు కోల్పోయామని పేర్కొంటున్న బాధితులు ఏళ్లుగా న్యాయం కోసం ప్రభుత్వ కార్యాలయాలు, న్యాయస్థానాల చుట్టూ తిరుగుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అసలు హక్కుదారుల సమస్యలు పరిష్కారం కాకముందే భూముల రికార్డుల్లో మార్పులు జరిగితే తమకు తీవ్ర నష్టం జరుగుతుందని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సమగ్ర విచారణకు ప్రజల డిమాండ్:

తుప్రాన్‌పేటలోని 45 ఎకరాల భూములను 22-ఎ నిషేధిత జాబితా నుంచి తొలగించిన అంశంపై పూర్తి స్థాయి విచారణ జరపాలని బాధితులు, స్థానిక వర్గాలు కోరుతున్నారు. ఈడీ ఆంక్షలు ఉన్నాయా? ఉంటే వాటి మధ్య రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఎలా ముందుకు సాగింది? ఫైలు ఏయే అధికారుల వద్దకు వెళ్లింది? ఏ ఉత్తర్వుల ఆధారంగా నిషేధిత జాబితా నుంచి భూములను తొలగించారు? అనే అంశాలను వెలుగులోకి తేవాలని డిమాండ్ చేస్తున్నారు. జిల్లాలోని నయీం కేసుతో సంబంధం ఉన్నట్లు పేర్కొంటున్న మొత్తం భూముల రికార్డులను పునఃపరిశీలించి, అవకతవకలు జరిగితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం: ప్రభుత్వ విప్ వేముల వీరేశం

- దుబ్బాకలో గుండాల లావణ్య చిత్రపటానికి నివాళి
- దశదిన కర్మ కార్యక్రమానికి హాజరైన నకిరేకల్ ఎమ్మెల్యే

తొలివెలుగు, రామన్నపేట : కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటారని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. రామన్నపేట మండలం దుబ్బాక గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి గుండాల నర్సింహ భార్య లావణ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం గ్రామంలో నిర్వహించిన ఆమె దశదిన కర్మ కార్యక్రమానికి ఎమ్మెల్యే వేముల వీరేశం హాజరయ్యారు. ఈ సందర్భంగా లావణ్య చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పున్న జగన్మోహన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ నంద్యాల భిక్షంరెడ్డి, నాయకులు గంగుల వెంకటరాజరెడ్డి, గుత్తా నర్సిరెడ్డి, ప్రభాకర్, సతీష్, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కొలువుదీరిన పీఏసీఎస్ పాలకవర్గాలు

- పోచంపల్లి, జూలూరు పీఏసీఎస్ చైర్మన్ల ప్రమాణస్వీకారం
- ఘనంగా సన్మానించిన కాంగ్రెస్ శ్రేణులు
- ప్రమాణ స్వీకారం చేయించిన జిల్లా సహకార అధికారి నాగార్జున

తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి : మండల పరిధిలోని పోచంపల్లి, జూలూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) నూతన చైర్మన్లు, పాలకవర్గ సభ్యుల ప్రమాణస్వీకార మహోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. పోచంపల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా పాక మల్లేష్ యాదవ్, జూలూరు పీఏసీఎస్ చైర్మన్‌గా కళ్లెం రాఘవరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. జిల్లా సహకార అధికారి (డీసీఓ) నాగార్జున నూతన చైర్మన్లు, కమిటీ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించి, అధికారికంగా బాధ్యతలను అప్పగించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్, కాంగ్రెస్ శ్రేణులు నూతన చైర్మన్లను ఘనంగా సన్మానించాయి. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన చైర్మన్లు మాట్లాడుతూ.. రైతాంగ సంక్షేమమే ధ్యేయంగా, సహకార సంఘాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో భూదాన్ పోచంపల్లి మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఉప్పునూతల వెంకటేష్ యాదవ్, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు భారత లవ్‌కుమార్, పీఏసీఎస్ వైస్ చైర్మన్లు కొట్టం కరుణాకర్ రెడ్డి, మక్తాల రమేష్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఏర్పుల శ్రీనివాస్, నాయకులు పకీరు మల్లారెడ్డి, పడమటి భూపాల్ రెడ్డి, అంబరీష్ రెడ్డి, డైరెక్టర్లు రావుల అనిల్, సామల రాజు రెడ్డి, ఆర్ల ఐలయ్య, పచ్చ వెంకటేష్, పావిరాల లింగమ్మ, రాములమ్మ, చంద్రు, బొబ్బల సుభాష్ రెడ్డి, సీఈఓలు బాల్‌రెడ్డి, రెబ్బాస్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

60 ఏళ్లుగా మా స్వాధీనంలో ఉన్న భూమిపై వివాదమేంటి?

- ప్రజావాణిని ఆశ్రయించిన గుడిమల్కాపురం గ్రామస్తులు
- కలెక్టర్‌కు పత్రాలతో సహా వివరణ సమర్పణ

తొలివెలుగు, యాదాద్రి భువనగిరి కలెక్టరేట్, సంస్థాన్ నారాయణపురం : గుడిమల్కాపురం గ్రామంలోని సర్వే నంబర్ 103 స్థలానికి సంబంధించి కొందరు చేస్తున్న ఆరోపణలపై విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని గ్రామస్తులు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో బాధిత కుటుంబాలతో కలిసి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన గ్రామస్తులు అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సుమారు 60 సంవత్సరాల క్రితం మన్నే జనార్దన్ రెడ్డి వద్ద నుంచి సర్వే నంబర్ 103లోని భూమిని గ్రామానికి చెందిన పలువురు కొనుగోలు చేశారన్నారు. దానికి సంబంధించిన సేల్ డీడ్లు, సాదా బైనామాలు, రెవెన్యూ పట్టాలు, 1993 కోర్టు డిక్రీ ఆర్డర్లు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. పాత ఇళ్లు శిథిలమవ్వడంతో అందుబాటులో ఉన్న పత్రాలు, పంచాయతీ అనుమతులతో కొత్త ఇళ్లు నిర్మిస్తుంటే అక్రమ ఆక్రమణలంటూ కొందరు తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని రికార్డులను సమగ్రంగా పరిశీలించి తమకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో అంతటి వీరయ్య, అంతటి బుచ్చమ్మ, అంతటి సత్తయ్య, అంతటి ధనరాజ్, ముద్దంగుల నరసింహ, మన్నె ఇంద్రసేనరెడ్డి, మన్నె నర్సిరెడ్డి, మన్నె చిత్రసేనరెడ్డి, వార్డు సభ్యులు ఉడుగు నాగరాజు, వీరమల్ల కార్తీక్‌గౌడ్, ఏనుగు రఘుపతి, ఇద్దయ్య సంపంగి, ఏనుగు బుచ్చిరెడ్డి, సిద్ధగోని శ్రీనివాస్, కారంగా మారయ్య, మన్నె సత్తిరెడ్డి, మన్నె శంకర్‌రెడ్డి, అంతటి శంకరయ్య, ఏర్పుల బుచ్చయ్య, కుమ్మరి వెంకటయ్య, కరింగ యాదయ్య, టంగుటూరి బాబు, సిద్ధగోని గోపాల్, రేవల్లి ఎల్లయ్య, రేవెల్లి సత్తయ్య, సయ్యద్ నజీర్, ముద్దం యాదయ్య, పల్చం యాదయ్య, అనిమల్ల రాములమ్మ, పల్లె జయలక్ష్మి, అంతటి కిష్టమ్మ, అంతటి యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచిన పశ్చిమగోదావరి

భీమవరం, సెప్టెంబర్ 21 : జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సారథ్యంలో పి జి ఆర్ ఎస్ లో రాష్ట్రంలో మిగిలిన జిల్లాల కన్నా పశ్చిమగోదావరి జిల్లా అత్యుత్తమ పనితీరు కనబరిచింది. ప్రజల అర్జీల స్వీకరణ నుంచి సమస్యల పరిష్కారం వరకు సమర్థవంతమైన పర్యవేక్షణకు జిల్లా అధికారులు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణికి అభినందనలు తెలిపారు. అమరావతిలో ఈనెల 11వ తేదీన నిర్వహించిన రెండో రోజు కలెక్టర్ల సమావేశంలో పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సారథ్యంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, వారి సమస్యలను పరిష్కరించడంలో జిల్లా యంత్రాంగం కనబరిచిన అత్యుత్తమ పనితీరును ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా ప్రశంసించారు. పీజీఆర్ఎస్ నిర్వహణలో పశ్చిమగోదావరి జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచి మంచి పనితీరు కనబరిచిందని ముఖ్యమంత్రి అభినందించడం జిల్లాకు గర్వకారణం అని అధికారులు అన్నారు. ఈ సందర్భంగా సోమవారం కలెక్టరేట్లోని పి జి ఆర్ ఎస్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులు డిఆర్ఓ పి గ్లోరియా, జిల్లా పిజిఆర్ఎస్ నోడల్ అధికారి వై దోసి రెడ్డి, డ్వామా పిడి డాక్టర్ కె సిహెచ్ అప్పారావు, వ్యవసాయ శాఖ అధికారి జి సునీత, స్వర్ణ గ్రామం స్వర్ణ వార్డు అధికారి వెంకటలక్ష్మి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిని శాలువా కప్పి ఘనంగా సన్మానించి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులు అందరూ జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ను ప్రశంసిస్తూ, పీజీఆర్ఎస్ కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీని నిశితంగా పరిశీలిస్తూ, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి సమస్యలకు పరిష్కారం చూపేలా నిరంతరం పర్యవేక్షిస్తున్నారని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో జిల్లా కలెక్టర్ చురుకైన విధానాన్ని అవలంబించడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు పీజీఆర్ఎస్ ఒక సమర్థవంతమైన వేదికగా నిలిచేలా జిల్లా కలెక్టర్ చర్యలు చేపట్టారు. అర్జీల స్వీకరణకు మాత్రమే పరిమితం కాకుండా, వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులను బాధ్యులను చేయడం, పరిష్కార పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించడం, పెండింగ్ అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించడం వంటి చర్యలతో ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా జిల్లా యంత్రాంగాన్ని ముందుకు నడిపిస్తున్నారు. పీజీ ఆర్ఎస్లో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవ పరిస్థితులను తెలుసుకోవడంతో పాటు, అర్జీదారులకు సంతృప్తికరమైన పరిష్కారం అందేలా అధికారులు పనిచేసే విధంగా జిల్లా కలెక్టర్ నిరంతరం సమీక్షలు నిర్వహిస్తున్నారు. దీంతో ప్రజా సమస్యల పరిష్కారంలో జిల్లా మంచి ఫలితాలను సాధిస్తూ రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందింది. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ, జిల్లా అధికారులకు మరింత బాధ్యతలు పెరిగాయని, ఇదే స్ఫూర్తితో ప్రజల సమస్యలను వేగవంతంగా పరిష్కరించి, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని ఆమె అధికారులు అన్నారు. సీఎంవో నుంచి అందిన ఫిర్యాదులపై కూడా జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదుదారులతో నేరుగా ఫోన్లో మాట్లాడటంతో పాటు, అవసరమైన సందర్భాల్లో వారితో నేరుగా మాట్లాడి సమస్యను తెలుసుకుని, త్వరితగతిన పరిష్కారం లభించేలా చొరవ చూపాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను స్వయంగా తెలుసుకుని పరిష్కరించే విధంగా జిల్లా అధికారులు చర్యలు తీసుకొని, పీజీఆర్ఎస్ పనితీరుకు మరింత బలం చేకూర్చాలని అని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా సమాచార శాఖ, భీమవరం వారిచే జారీ చేయడమైనది...

వినాయక చవితి సందర్భంగా అన్నదాన కార్యక్రమం.

తాడేపల్లిగూడెం: సెప్టెంబర్ 21: పట్టణంలోని 14వ వార్డు సత్యనారాయణపేటలో ఓఎం ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో వినాయక చవితి మహోత్సవాన్ని పురస్కరించుకుని అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వినాయక స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వినాయక చవితి పర్వదినం ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

అమెరికాలో వినాయక చవితి ఉత్సవాలు

ఏలూరు : అమెరికాలో దెందులూరు గ్రామస్తుల ఆకుల శ్రీధర్ కుటుంబ సభ్యులతో పాటు తెలుగువారు వినాయక చవితి ఉత్సవాలను సోమవారం ఘనంగా బక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేక అలంకరణ పూజలు భజనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకుల శ్రీధర్ మాట్లాడుతూ ఖండంతరాలు దాటినప్పటికీ తెలుగు గౌరవిస్తూ పాటించడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. తమ తల్లిదండ్రులు నరసింహారావు ఉమాలక్ష్మి చెన్నప్పట్నుంచి నేర్పిన క్రమశిక్షణ ను అనుసరిస్తున్నామన్నారు.

పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు సరైన పునాది పోషకాహారం, ప్రేమతో కూడిన సంరక్షణ

ప్రతి చిన్నారికి సమతుల్య ఆహారం అందేలా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి

జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం, సెప్టెంబర్ 21: పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు సరైన పునాది పోషకాహారం, ప్రేమతో కూడిన సంరక్షణేనని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. చిన్నారులకు బాల్యం నుంచే సమతుల్యమైన పోషకాహారం అందించడం ద్వారా వారి శారీరక, మానసిక ఎదుగుదలకు బలమైన పునాది ఏర్పడుతుందని తెలిపారు. 9వ జాతీయ పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా పోషణ ఆహారం తగినంత ప్రోటీన్ సమాజ భాగస్వామ్యం అనే అంశంపై జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన పోషణ స్టాల్ను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పరిశీలించారు. స్టాల్లో ఏర్పాటు చేసిన పోషకాహార పదార్థాలు, చిరుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు తదితరాలను పరిశీలించారు. వాటి పోషక విలువలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సెప్టెంబరు 9వ తేదీ నుంచి అక్టోబరు 8వ తేదీ వరకు నిర్వహిస్తున్న 9వ జాతీయ పోషకాహార మహోత్సవాలు కార్యక్రమాలను జిల్లాలో సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మన పోషణ మన కుటుంబానికి బలం అనే భావన ప్రతి కుటుంబంలో పెంపొందాల్సిన అవసరం ఉందన్నారు. మన చుట్టూ అందుబాటులో ఉండే ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, చిరుధాన్యాలు, పప్పుదినుసులు, ప్రోటీన్తో కూడిన ఆహార పదార్థాలను నిత్య ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు. కాలానుగుణంగా లభించే స్థానిక ఆహార పదార్థాలను వినియోగించడం ద్వారా తక్కువ ఖర్చుతోనే కుటుంబానికి అవసరమైన పోషకాలను అందించవచ్చని తెలిపారు. పిల్లలు, గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు తప్పనిసరిగా పోషకాహారం తీసుకునేలా కుటుంబ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. పోషణతో ఆరోగ్యం అభివృద్ధి సాధ్యమవుతుందని, ఆరోగ్యకరమైన బాల్యం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని అన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలు, తల్లులు, గర్భిణీలు, కిశోర బాలికలకు పోషకాహారంపై అవగాహన కల్పించడంతో పాటు, పోషకాహార లోపాన్ని గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. బిడ్డ పుట్టినప్పటి నుంచి మొదటి వెయ్యి రోజులు బిడ్డ శారీరక, మానసిక, మెదడు ఎదుగుదలకు అత్యంత కీలకమైనవని జిల్లా కలెక్టర్ అన్నారు. ఈ కాలంలో తల్లి, బిడ్డకు తగిన పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ, పరిశుభ్రత, ప్రేమతో కూడిన సంరక్షణ అందించాల్సిన బాధ్యత కుటుంబ సభ్యులపై ఉందన్నారు. ఆరు నెలల వయస్సు వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, ఆరు నెలలు పూర్తయిన తరువాత వయస్సుకు తగిన అదనపు ఆహారాన్ని క్రమంగా పరిచయం చేయాలని సూచించారు. బిడ్డ ఎంత తింటోంది, బిడ్డ బరువు, ఎదుగుదల ఎలా ఉంది అనే విషయాలను అంగన్వాడీ సిబ్బంది, తల్లిదండ్రులు నిరంతరం గమనించాలని అన్నారు. బిడ్డ ఎదుగుదలను తెలుసుకోవాలంటే బిడ్డ ఆరోగ్యాన్ని క్రమం తప్పకుండా పరిశీలించాలి. ప్రతి చిన్నారికి సరైన పోషణతో పాటు ప్రేమ, ప్రేరణ, శ్రద్ధ అవసరం" అని కలెక్టర్ పేర్కొన్నారు. మన అంగన్వాడీ మన బాధ్యత అనే భావనతో ప్రతి ఒక్కరూ అంగన్వాడీ కేంద్రాల కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకాహారం, ఆరోగ్య సేవలు, బాలల ఎదుగుదల పర్యవేక్షణ వంటి కార్యక్రమాలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోషకాహార లోపం ఉన్న పిల్లలను ముందుగానే గుర్తించి వారికి అవసరమైన వైద్య, పోషకాహార సేవలు అందేలా అంగన్వాడీ, వైద్య, ఆరోగ్య శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో పోషకాహారం పై అవగాహన పెంచేందుకు మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, యువత భాగస్వామ్యం కావాలని కోరారు. పోషకాహారం శారీరక ఎదుగుదలకు మాత్రమే కాకుండా మెదడు ఎదుగుదలకు కూడా ఎంతో ముఖ్యమని తెలిపారు. ప్రతి చిన్నారి ఆరోగ్యంగా, ఆనందంగా ఎదగడం కోసం ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, సేవలను అర్హులైన ప్రతి కుటుంబం వినియోగించుకునేలా అధికారులు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి డి శ్రీలక్ష్మి, డిస్టిక్ కో ఆర్డినేటర్ పి. చంద్రశేఖర్ , నోడల్ అధికారి విజయలక్ష్మి, సి డి పి ఓ లు, సూపర్వైజర్లు ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలులో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం.....

ప్రజా సమస్యలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి: కామిశెట్టి సత్తిబాబు

నిడదవోలు: సెప్టెంబర్ 21: నిడదవోలు పట్టణంలోని 15వ వార్డు రాయిపేటలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 15వ వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులకు గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా నిడదవోలు పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు కామిశెట్టి సత్తిబాబు మాట్లాడుతూ రానున్న మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లో విస్తృతంగా పర్యటించాలని సూచించారు. కూటమి ప్రభుత్వ పాలనలో నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు తదితర అంశాలను ప్రజలకు వివరించాలని అన్నారు. అదేవిధంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. నిడదవోలు మాజీ ఎమ్మెల్యే జి. శ్రీనివాస నాయుడు హయాంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి (=ాదీ) నిర్మాణానికి చేసిన కృషి, 100 పడకల ఆసుపత్రి పనులు ప్రారంభం కావడం, 'ఐ లవ్ నిడదవోలు' ప్రాంతంలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలని కోరారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతి కార్యకర్త, నాయకుడు సమష్టిగా కృషి చేయాలని, అందుకు ఇప్పటి నుంచే సంసిద్ధం కావాలని సత్తిబాబు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నిడదవోలు పట్టణ మాజీ వైస్ చైర్మన్ ఎలగాడ బాలరాజు, జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యదర్శి చాన్ బాషా, వార్డు ఇన్‌చార్జి మొదలవలస నాని, మాజీ కౌన్సిలర్ నాగమణి, టౌన్ యూత్ ప్రెసిడెంట్ దాకే అనిల్ కుమార్, ఎస్సీ సెల్ అధ్యక్షులు ఉసురుమర్తి సూరి, నిడదవోలు పట్టణ వైఎస్సార్‌సీపీ కార్యదర్శి తోలేటి సత్యనారాయణ (కోటి), 5వ వార్డు ఇన్‌చార్జి కొత్తూరు శ్రీనివాస్, మైనారిటీ నాయకులు ఎస్కే లాలూ, ఆలమూరి రాజశేఖర్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి

- 14వ వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు

- బాపూజీ సేవలను స్మరించుకున్న ప్రజాప్రతినిధులు, చేనేత నాయకులు

- గ్రామ సర్పంచ్ కైరంకొండ స్వప్న-అశోక్ నేత

తొలివెలుగు, చౌటుప్పల్: తెలంగాణ ఉద్యమ నాయకుడు, చేనేత కార్మికుల సంక్షేమం కోసం జీవితాంతం పోరాడిన కొండా లక్ష్మణ్ బాపూజీ 14వ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం ఘనంగా నివాళు లర్పించారు. గ్రామంలోని బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కైరంకొండ స్వప్న-అశోక్, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు జల కోటేశ్వరరావు తదితరులు బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాపూజీ జీవిత విశేషాలు, తెలంగాణ ఉద్యమంలో ఆయన పోషించిన పాత్ర, చేనేత రంగం అభివృద్ధి కోసం చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం, వారి హక్కుల పరిరక్షణ కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన పోరాటాలు స్ఫూర్తిదాయకమని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. చేనేత రంగంపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాల సంక్షేమం కోసం ఆయన నిరంతరం కృషి చేశారని, సామాజిక న్యాయం కోసం తన జీవితాన్ని అంకితం చేశారని గుర్తు చేసుకున్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. చేనేత రంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, చేనేత సంఘాలు సమన్వయంతో కృషి చేయాలని పలువురు ఆకాంక్షించారు. బాపూజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని చేనేత కార్మికుల సంక్షేమం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గంజి వనజ--కృష్ణ, మాచర్ల కృష్ణ, గడ్డం నర్సింహ, వడ్డేపల్లి వెంకటేష్, రచ్చ ఉపేందర్, పొట్టబత్తిని వాసుదేవ్, వెంకటేశం, చేనేత సహకార సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు, చేనేత కార్మికులు, స్థానికులు తదితరులు పాల్గొని బాపూజీకి ఘనంగా నివాళు లర్పించారు.

కేసీఆర్ చారిత్రక నిర్లక్ష్యంతోనే నీటి ఎద్దడి: జూపల్లి కృష్ణారావు

గత బీఆర్ఎస్ ప్రభుత్వ అవగాహన రాహిత్యం, నిర్లక్ష్యపూరిత విధానాల వల్లే నేడు రాష్ట్రంలో నీటి నిల్వలు తగ్గి రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి దాపురించిందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అసెంబ్లీ ప్రాంగణంలోని మీడియా సెంటర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన... కేసీఆర్ హయాంలో కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాను కేవలం 30 శాతానికే పరిమితం చేసి ఆంధ్రా ప్రాజెక్టులకు లబ్ధి చేకూర్చారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పోరాడి ఆ వాటాను 43 శాతానికి పెంచుకున్నామని స్పష్టం చేశారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ప్రారంభించిన కల్వకుర్తి, భీమా, నెట్టంపాడు ప్రాజెక్టులను బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే పాలమూరు తీవ్రంగా నష్టపోయిందన్నారు. రూ.8 లక్షల కోట్ల అప్పులు చేసిన కేసీఆర్ పాలమూరు జిల్లాలో రిజర్వాయర్లను ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. గట్టు వద్ద 20 టీఎంసీల రిజర్వాయర్ కడతానని చెప్పిన కేసీఆర్ ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని విమర్శించారు. జూరాల వద్ద అదనపు రిజర్వాయర్ నిర్మించకపోవడం వల్లే ఈనాడు 5.50 లక్షల ఎకరాల ఆయకట్టు ఎండిపోయే పరిస్థితి వచ్చిందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం ఈ నీటి ఎద్దడిని నివారించేందుకు 15 టీఎంసీల గూడెందొడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణానికి జీవో జారీ చేయడమే కాకుండా, రికార్డు స్థాయిలో 19,543 మెగావాట్ల విద్యుత్ డిమాండ్‌ను తట్టుకుంటూ సరఫరా వ్యవస్థను కాపాడుతోందని వెల్లడించారు. ఎల్ నినో కరవు పరిస్థితులను ఎదుర్కొనేందుకు కేంద్రం నుంచి రూ.20 వేల కోట్ల నిధులు, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా తీసుకురావడంలో విఫలమైన బీఆర్ఎస్, బీజేపీ నేతలు కేవలం శవాలపై పేలాలు ఏరుకునే రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు.

31 సినిమాలకు సెన్సార్ మినహాయింపు కట్.. కేంద్రంపై శశిథరూర్ ఫైర్

కేరళ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 31 చిత్రాలకు సెన్సార్ మినహాయింపు నిరాకరణ

ఇది భావ ప్రకటనా స్వేచ్ఛపై దాడి అని కేంద్రంపై శశిథరూర్ విమర్శ

నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని కోరిన కేరళ చలనచిత్ర అకాడమీ

రాజకీయ, సామాజిక అంశాలపై ఉన్న చిత్రాలను తిరస్కరించినట్లు ఆరోపణలు

కేరళలో నిర్వహించనున్న 18వ అంతర్జాతీయ డాక్యుమెంటరీ, షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ (ఐడీఎస్ఎఫ్ఎఫ్‌కే)లో ప్రదర్శించాల్సిన 31 చిత్రాలకు సెన్సార్ మినహాయింపు ఇచ్చేందుకు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ నిరాకరించడం వివాదానికి దారితీసింది. ఈ నిర్ణయాన్ని కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ తీవ్రంగా తప్పుబట్టారు. ఇది భావప్రకటనా స్వేచ్ఛపై జరుగుతున్న దాడి అని ఆయన అభివర్ణించారు. ఈ అంశంపై కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌కు 'ఎక్స్' వేదికగా శశిథరూర్ ఒక విజ్ఞప్తి చేశారు. అధికారుల నిర్ణయాన్ని పక్కనపెట్టి, సదరు చిత్రాలకు తక్షణమే అనుమతులు మంజూరు చేయాలని కోరారు. ఇటువంటి చర్యల వల్ల అంతర్జాతీయ స్థాయిలో సృజనాత్మక కళాకారులు, చిత్రనిర్మాతల దృష్టిలో భారత ప్రతిష్ఠ మసకబారుతుందని ఆయన హెచ్చరించారు. తిరువనంతపురంలో సెప్టెంబర్ 25 నుంచి 30 వరకు ఈ ఫెస్టివల్ జరగనుంది. నిర్వాహకులైన కేరళ రాష్ట్ర చలనచిత్ర అకాడమీ మొత్తం 347 చిత్రాలను పరిశీలన కోసం పంపగా, కేంద్రం 31 చిత్రాలకు మినహాయింపును నిలిపివేసింది. వీటిలో రాజకీయ అసమ్మతి, కుల వివక్ష, గాజా సంక్షోభం, ఇరాన్ నిరసనలు వంటి అంశాల నేపథ్యంగా రూపొందించిన చిత్రాలు ఉన్నాయి. తిరస్కరించిన వాటిలో అట్టప్పాడి గిరిజనుల జీవితంపై తీసిన 'గ్లోబ్' అనే మలయాళ చిత్రం కూడా ఉండటం గమనార్హం. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం చలనచిత్ర ఉత్సవాల నిర్వహణ స్వేచ్ఛను హరించడమేనని కేరళ సాంస్కృతిక శాఖ మంత్రి పి.సి. విష్ణునాథ్ విమర్శించారు. మరోవైపు, చలనచిత్ర అకాడమీ ఈ నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని కేంద్రాన్ని అభ్యర్థించింది. ఇప్పటికే జ్యూరీ సభ్యులు, చిత్రనిర్మాతలు ప్రయాణ ఏర్పాట్లు చేసుకున్నారని, స్క్రీనింగ్ ఫీజులు కూడా చెల్లించామని అకాడమీ స్పష్టం చేసింది. ఈ ఆకస్మిక నిర్ణయం వల్ల ఫెస్టివల్ షెడ్యూల్ అస్తవ్యస్తమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది.

ఏపీలో జూనియర్ డాక్టర్లు, హౌస్ సర్జన్ల స్టైఫండ్ పెంపు

ఎంబీబీఎస్, బీడీఎస్ ఇంటర్న్‌లకు 10 శాతం పెరుగుదల

పీజీ విద్యార్థులకు 5%, సూపర్ స్పెషాలిటీ వారికి 3.5% పెంపు

ప్రభుత్వంపై ఏటా రూ.34.08 కోట్ల అదనపు ఆర్థిక భారం

2026 జనవరి 1 నుంచే పెంపు వర్తిస్తుందని ఉత్తర్వుల్లో వెల్లడి

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పనిచేస్తున్న జూనియర్ డాక్టర్లు, హౌస్ సర్జన్లకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వారి స్టైఫండ్‌ను పెంచుతూ సోమవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. పెంచిన స్టైఫండ్ 2026 జనవరి 1వ తేదీ నుంచి వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిర్ణయంతో ప్రభుత్వ ఖజానాపై ఏటా రూ.34.08 కోట్ల అదనపు భారం పడనుంది. వివరాల్లోకి వెళితే, తమ పనిభారానికి తగినట్లుగా స్టైఫండ్ పెంచాలని జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ (జూడా) కొంతకాలంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేపట్టింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వారి డిమాండ్లను పరిగణనలోకి తీసుకుని స్టైఫండ్ పెంపునకు ఆమోదం తెలిపింది. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, ఎంబీబీఎస్, బీడీఎస్ హౌస్ సర్జన్లకు 10 శాతం స్టైఫండ్ పెంచారు. దీంతో వారి నెలవారీ స్టైఫండ్ రూ.28,497కి చేరింది. అదేవిధంగా, పీజీ డిగ్రీ, డిప్లొమా కోర్సులు చేస్తున్న వైద్య విద్యార్థులకు 5 శాతం, సూపర్ స్పెషాలిటీ కోర్సులు అభ్యసిస్తున్న వారికి 3.5 శాతం చొప్పున స్టైఫండ్‌ను పెంచారు. ఈ పెంపు నిర్ణయం ఎంబీబీఎస్, బీడీఎస్, పీజీ మెడిసిన్, సూపర్ స్పెషాలిటీ, ఎండీఎస్, డీఎన్‌బీ విద్యార్థులందరికీ వర్తిస్తుంది. జూనియర్ డాక్టర్ల ఆందోళనల నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల వైద్య విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మైసమ్మ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన పవన్ కల్యాణ్

ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్ సోమవారం సొంత నియోజకవర్గంలో పర్యటించారు. ఫక్రుద్దీన్ పాలెం గ్రామంలోని మైసమ్మ చెరువు గట్టుపై వెలసిన మైసమ్మ అమ్మవారిని దర్శించుకుని, పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం, గ్రామీణ చెరువులకు సరికొత్త రూపునిచ్చే బృహత్తర కార్యక్రమంలో భాగంగా రూ. 73 లక్షల వ్యయంతో సుందరీకరించిన మైసమ్మ చెరువును ప్రజలకు అంకితం చేశారు. గ్రామాల్లోని చెరువులను కేవలం నీటి వనరులుగా కాకుండా, ప్రజలందరికీ ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని పంచే సామాజిక కేంద్రాలుగా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ తెలిపారు. ఫక్రుద్దీన్ పాలెంలోని మైసమ్మ చెరువును రాష్ట్రానికే ఒక మోడల్‌గా అభివృద్ధి చేసినట్లు వివరించారు. చెరువు చుట్టూ ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్, ఓపెన్ ఎయిర్ జిమ్, పిల్లల పార్కును ఆయన ప్రారంభించారు. చెరువు గట్టుపై కలియదిరుగుతూ, అక్కడి వృక్షాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. చెరువు మధ్యలో నూతనంగా నిర్మిస్తున్న నందీశ్వరుడి సహిత శివుని విగ్రహాన్ని పరిశీలించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా చెరువు గట్టును బలోపేతం చేసి, పచ్చదనంతో నింపారు. ప్రజలు వ్యాయామం చేసుకునేలా ఓపెన్ జిమ్‌తో పాటు, జాతీయ భావాన్ని పెంపొందించేలా జెండా స్థూపాన్ని కూడా ఏర్పాటు చేశారు. చెరువు పక్కనే చిన్నారుల కోసం ప్రత్యేకంగా అభివృద్ధి చేసిన పార్కును పిల్లలతో కలిసి ప్రారంభించిన పవన్ కల్యాణ్, వారితో సరదాగా గడిపి చాక్లెట్లు పంచారు.

రాష్ట్రవ్యాప్తంగా చెరువుల ఆధునికీకరణ

ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన (గ్రామీణ) నిధులతో రాష్ట్రవ్యాప్తంగా రూ. 50 కోట్లతో 105 చెరువుల సుందరీకరణ పనులు చేపట్టినట్లు పవన్ కల్యాణ్ వెల్లడించారు. ఒక్క పిఠాపురం నియోజకవర్గంలోనే రూ. 6 కోట్లతో 11 చెరువులను అభివృద్ధి చేస్తున్నామని, వీటికి సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కాకినాడ జిల్లా పరిధిలో అభివృద్ధి చేసిన 14 చెరువుల ఫోటో గ్యాలరీని తిలకించారు. ఈ నెలాఖరు నాటికి రాష్ట్రంలోని అన్ని చెరువుల పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. పర్యటనలో భాగంగా ఆయన గ్రామ సచివాలయాన్ని, చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామస్తుల నుంచి వినతులు స్వీకరించి, వారి సమస్యలను ఆప్యాయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

కేసీఆర్ ఫామ్‌హౌస్ చుట్టూ కొనసాగుతున్న భూసర్వే..

రంగంలోకి రెవెన్యూ అధికారులు

ఎర్రవల్లిలో భూములపై కొనసాగుతున్న రెవెన్యూ సర్వే

సర్వే నంబర్ 325పై అధికారుల ప్రత్యేక దృష్టి

మొత్తం 388 ఎకరాల భూముల పరిశీలన

శాటిలైట్ మ్యాపింగ్‌తో భూముల హద్దుల పరిశీలన

ఆక్రమణలని తేలితే భూముల స్వాధీనానికి చర్యలు

సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి గ్రామంలో మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసర భూములపై రెవెన్యూ అధికారులు సర్వే కొనసాగిస్తున్నారు. ఎర్రవల్లితో పాటు వెంకటాపూర్, వరదరాజుపూర్ సరిహద్దుల్లో ఉన్న భూములను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఆదివారం సెలవు కావడంతో నిలిచిన సర్వే.. సోమవారం ఉదయం తిరిగి ప్రారంభమైంది. సర్వే నంబర్ 325 పరిధిలో ఉన్న ప్రభుత్వ, అసైన్డ్ భూములపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. మొత్తం 388 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ భూముల్లో ప్రభుత్వ భూమి ఎంత? అసైన్డ్ భూమి ఎంత? ప్రస్తుతం ఎవరి అధీనంలో ఉంది? ప్రైవేటు పట్టా భూములు ఎంతమేర ఉన్నాయి? అనే వివరాలను సేకరిస్తున్నారు. అసిస్టెంట్ డైరెక్టర్ సుదర్శన్ రాథోడ్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సేవ్యానాయక్, గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ, స్థానిక తహసీల్దార్లతో కూడిన ప్రత్యేక బృందాలు సర్వేలో పాల్గొంటున్నాయి. శాటిలైట్ మ్యాపింగ్, ఆధునిక సాంకేతికతతో పాటు పాత రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తూ భూముల హద్దులను నిర్ధారిస్తున్నారు. సర్వే నంబర్ 325 పరిధిలో భూములు ఉన్న 100 మందికి పైగా రైతులకు ఇప్పటికే అధికారులు నోటీసులు ఇచ్చారు. పట్టాదార్ పాస్‌పుస్తకాలు, ఇతర యాజమాన్య పత్రాలతో సర్వే ప్రాంతానికి రావాలని సూచించారు. ఫామ్‌హౌస్ పరిసర భూముల కేటాయింపులు, ధరణి రికార్డుల్లో అక్రమాలపై ఇటీవల అసెంబ్లీలో చర్చ జరిగిన నేపథ్యంలో ఈ విచారణ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. సర్వే పూర్తయ్యాక సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి అందజేయనున్నారు. ప్రభుత్వ లేదా అసైన్డ్ భూములు ఆక్రమణకు గురైనట్లు తేలితే.. నిబంధనల ప్రకారం స్వాధీనం చేసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

రాయలసీమలో అద్భుతం.. గణపయ్య కోసం కదిలొచ్చిన గంగమ్మ!

వినాయక నిమజ్జనానికి నీళ్లు లేని రాయలసీమలో భారీ వర్షాలు

ఎండిన చెరువుల్లో వదిలిన విగ్రహాలు నీటిలో మునక

గణపయ్యను గంగమ్మే ఒడిలోకి చేర్చుకుందంటున్న నెటిజన్లు

అనంతపురం, కర్నూలు జిల్లాల్లో పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు

ఖరీఫ్‌లో ఇదే అతిపెద్ద వర్షం.. రైతుల్లో వెల్లివిరిసిన ఆనందం

రాయలసీమలో ప్రకృతి ఓ అద్భుతాన్ని ఆవిష్కరించింది. మొన్నటిదాకా ఎల్‌నినో ప్రభావంతో వర్షాల్లేక అల్లాడిపోయిన సీమ జిల్లాలను గత రెండు రోజులుగా భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. వినాయక నిమజ్జనానికి నీళ్లు లేక ప్రజలు ఎండిపోయిన చెరువుల్లో వదిలివెళ్లిన గణనాథులను.. ఇప్పుడు అవే చెరువుల్లోకి వచ్చి చేరిన నీరు ముంచెత్తుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆ గణనాథుడి కష్టాలు చూసి గంగమ్మే కదిలివచ్చిందంటూ నెటిజన్లు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల వల్ల రాయలసీమలోని అనంతపురం, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో చెరువులు, కుంటలు పూర్తిగా ఎండిపోయాయి. వినాయక చవితి సందర్భంగా ప్రతిష్ఠించిన విగ్రహాలను నిమజ్జనం చేయడానికి నీళ్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చాలా చోట్ల చేసేదేమీ లేక ఎండిపోయిన చెరువు గర్భంలోనే విగ్రహాలను వదిలేసి వెళ్లారు. ఈ దృశ్యాలు చూసి చాలామంది ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, నాలుగైదు రోజులుగా పరిస్థితి పూర్తిగా మారిపోయింది. అనంతపురం, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా అనంతపురం జిల్లాలో గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా మోస్తరు నుంచి భారీ వర్షాలు పడుతున్నాయి. దీంతో మొన్నటిదాకా బీడువారిన చెరువులు, కుంటలు, వాగులు, వంకలు జలకళను సంతరించుకున్నాయి. కొన్ని ప్రాంతాల్లో 10 సెంటీమీటర్ల వరకు వర్షపాతం నమోదైంది. ఎండిన చెరువుల్లో వదిలేసిన వినాయక విగ్రహాలు.. ఇప్పుడు వర్షపు నీటిలో నెమ్మదిగా మునుగుతున్న వీడియోలు అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాయి. "గణనాథుడిని సాగనంపేందుకు నీళ్లు లేవని బాధపడ్డాం.. కానీ ఆయన్ను తన ఒడిలోకి చేర్చుకునేందుకు గంగమ్మే స్వయంగా తరలివచ్చింది" అంటూ ప్రజలు సోషల్ మీడియాలో కామెంట్స్ చేస్తున్నారు. ఈ వర్షాలు ఖరీఫ్ సీజన్‌లో పండ్ల తోటల రైతులకు గొప్ప ఊరటనిచ్చాయని, ఇదే ఈ సీజన్‌లో అతిపెద్ద వర్షమని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరో మూడు నాలుగు రోజుల పాటు వర్షాలు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. మొత్తానికి కరువుతో అల్లాడిన సీమలో ఈ వర్షాలు కొత్త ఆశలు చిగురింపజేస్తున్నాయి.

దానం నాగేందర్ పిటిషన్ ను విచారణకు స్వీకరించిన సుప్రీంకోర్టు

పార్టీ ఫిరాయింపుల కేసులో దానంను అనర్హుడిగా ప్రకటించిన హైకోర్టు

హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేసిన దానం

దానం పిటిషన్ ను బుధవారం విచారించనున్న సుప్రీంకోర్టు

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను పదవి నుంచి అనర్హుడిగా ప్రకటిస్తూ తెలంగాణ హైకోర్టు ఇటీవల ఇచ్చిన సంచలన తీర్పుపై దేశ అత్యున్నత న్యాయస్థానంలో విచారణ ప్రక్రియ ప్రారంభమైంది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ దానం నాగేందర్ దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యవసరంగా విచారణకు స్వీకరించడానికి సుప్రీంకోర్టు సమ్మతించింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఎదుట దానం నాగేందర్ తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి ఈ అంశాన్ని ప్రస్తావించగా, ఈ పిటిషన్‌ను బుధవారం (సెప్టెంబర్ 23) విచారించనున్నట్లు ధర్మాసనం వెల్లడించింది. హైకోర్టు తీర్పు వల్ల ఖైరతాబాద్ స్థానం ఖాళీగా మారి ఉపఎన్నిక నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉన్నందున, హైకోర్టు ఉత్తర్వులపై వెంటనే స్టే విధించాలని దానం తరఫు న్యాయవాదులు సుప్రీంకోర్టులో వాదనలు వినిపించనున్నారు. గత తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరపున పోటీ చేసి విజయం సాధించిన దానం నాగేందర్... ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరడమే కాకుండా 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. ఒక పార్టీ తరపున ఎమ్మెల్యేగా గెలిచి మరో పార్టీ తరపున పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయడాన్ని రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ నిబంధనల ఉల్లంఘనగా పరిగణిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. అసెంబ్లీ స్పీకర్ ఇచ్చిన పాత ఆదేశాలను పక్కనపెట్టిన రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం దానం నాగేందర్‌ను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటించడంతో ఈ వివాదం ఇప్పుడు దేశ అత్యున్నత న్యాయస్థానం మెట్లు ఎక్కింది.

కారుమూరిని కస్టడీకి తీసుకున్న ఈడీ అధికారులు..

చంచల్‌గూడ జైలు నుంచి ఈడీ కార్యాలయానికి తరలింపు

ఏపీ మద్యం రవాణా టెండర్లలో అక్రమాల కేసు

ప్రభుత్వ ఖజానాకు రూ. 195.33 కోట్ల నష్టం వాటిల్లినట్టు ఈడీ గుర్తింపు

ఇదే కేసులో ఇప్పటికే కారుమూరి కుమారుడు కూడా అరెస్ట్

ఆంధ్రప్రదేశ్ మద్యం రవాణా టెండర్లలో చోటుచేసుకున్న భారీ అక్రమాల కేసు విచారణలో భాగంగా వైసీపీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు తమ కస్టడీలోకి తీసుకున్నారు. హైదరాబాద్‌లోని చంచల్‌గూడ కేంద్ర జైలు నుంచి బషీర్‌బాగ్‌లోని ఈడీ ప్రాంతీయ కార్యాలయానికి ఆయనను తరలించారు. నాంపల్లి ప్రత్యేక పీఎంఎల్ఏ కోర్టు అనుమతితో రెండు రోజుల పాటు ఆయనను విచారించనున్నారు. ఈ కేసుకు సంబంధించి ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ. 195.33 కోట్ల మేర భారీ నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక విచారణలో ఈడీ గుర్తించింది. నిబంధనలకు విరుద్ధంగా టెండర్ల సవరణలు చేయడం, డమ్మీ సబ్-కాంట్రాక్టర్లను పెట్టి భారీగా నిధుల మళ్లింపులు జరిపారన్న ఆరోపణలపై పీఎంఎల్ఏ చట్టం కింద కారుమూరితో పాటు ఆయన కుమారుడు సునీల్ కుమార్‌ను కూడా అధికారులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. న్యాయస్థానం విధించిన 14 రోజుల రిమాండ్‌లో భాగంగా చంచల్‌గూడ జైలులో ఉన్న కారుమూరిని కస్టడీకి కోరుతూ ఈడీ పిటిషన్ దాఖలు చేయగా కోర్టు అందుకు అనుమతించింది. రెండు రోజుల కస్టడీ విచారణలో అక్రమ నగదు లావాదేవీల అసలు నెట్‌వర్క్, నిధుల తుది చేరికపై మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి తెచ్చేందుకు అధికారులు విచారణను తీవ్రతరం చేశారు.

మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి హౌస్ అరెస్ట్

జూరాల ప్రాజెక్టు రైతులకు సాగునీటిని విడుదల చేయాలని బీఆర్ఎస్ డిమాండ్

జూరాల ప్రాజెక్ట్ ముట్టడికి బీఆర్ఎస్ పిలుపు

బీఆర్ఎస్ నేతలను ఎక్కడికక్కడ నిర్బంధిస్తున్న పోలీసులు

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని జూరాల ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు తక్షణమే సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన ప్రాజెక్టు ముట్టడి పిలుపు జిల్లా వ్యాప్తంగా తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా పోలీసులు భారీ ఎత్తున రంగంలోకి దిగి ముందస్తు అరెస్టులకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డిని వనపర్తిలోని ఆయన నివాసంలో పోలీసులు అదుపులోకి తీసుకుని గృహనిర్బంధం చేశారు. ముట్టడి కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉన్న బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల ఇళ్ల వద్ద ఇంటెలిజెన్స్ బలగాలను మోహరించి కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. పోలీసుల దిగ్బంధంతో జూరాల ఆనకట్ట పరిసరాలు, క్షేత్రస్థాయి ప్రాంతాలు పూర్తిగా వ్యూహాత్మక బలగాల మోహరింపుతో నిండిపోయాయి. వనపర్తి, ఆత్మకూరు, అమరచింత, నర్వ మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రాజెక్టు వైపు రాకుండా రహదారుల వెంట వాహన తనిఖీలు చేపట్టారు. మరోవైపు గద్వాలలోనూ కాలువలకు నీటిని విడుదల చేయాలనే డిమాండ్‌తో అఖిలపక్షం, రైతు సంఘాలు కలెక్టరేట్ ముట్టడికి పిలుపునివ్వడంతో అక్కడ కూడా నాయకులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. బీఆర్ఎస్ ముట్టడి పిలుపు, పోలీసుల కట్టుదిట్టమైన ఆంక్షల నడుమ జూరాల ప్రాజెక్ట్ సమీపంలో హైటెన్షన్ వాతావరణం కొనసాగుతోంది.

ట్యాంక్‌బండ్ వద్ద తీవ్ర ఉద్రిక్తత.. పోలీసులతో ఉత్సవ సమితి ఘర్షణ..

- గణేశ్ నిమజ్జనంపై ఆంక్షలతో ట్యాంక్‌బండ్‌పై హైటెన్షన్
- నిరసనకు దిగిన భాగ్యనగర్ ఉత్సవ సమితి, పోలీసుల మధ్య తోపులాట
- హైకోర్టు ఆదేశాల మేరకే ఆంక్షలని అధికారుల స్పష్టీకరణ
- సంప్రదాయాన్ని వీడేది లేదని, ట్యాంక్‌బండ్‌పైనే నిమజ్జనం చేస్తామని పట్టు
- పీఓపీ విగ్రహాల కోసం కృత్రిమ కొలనులు ఏర్పాటు చేస్తున్న జీహెచ్ఎంసీ

హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై గణేశ్ విగ్రహాల నిమజ్జనం అంశం మరోసారి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. హుస్సేన్‌సాగర్‌లో ట్యాంక్ బండ్ వైపు విగ్రహాల నిమజ్జనానికి అనుమతి లేదంటూ అధికారులు ఏర్పాటు చేసిన ఆంక్షలను వ్యతిరేకిస్తూ భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ఆందోళనకు దిగింది. ఈ క్రమంలో ఉత్సవ సమితి ప్రతినిధులకు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటుచేసుకున్నాయి. దీంతో ట్యాంక్‌బండ్ పరిసరాల్లో హైటెన్షన్ వాతావరణం నెలకొంది. వివరాల్లోకి వెళితే.. ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనాలకు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఉత్సవ సమితి ప్రతినిధులు అక్కడ బైఠాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసిన కొన్ని బారికేడ్లను తొలగించేందుకు ప్రయత్నించారు. వారిని పోలీసులు అడ్డుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ తోపులాటలో కొందరు పోలీసులు కిందపడిపోయినట్లు సమాచారం. అప్రమత్తమైన ఉన్నతాధికారులు అదనపు బలగాలను మోహరించి పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు తెలంగాణ హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగానే పర్యావరణ పరిరక్షణ కోసం హుస్సేన్‌సాగర్‌లో, ముఖ్యంగా ట్యాంక్‌బండ్‌పై ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ) విగ్రహాల నిమజ్జనాన్ని నియంత్రిస్తున్నట్లు జీహెచ్ఎంసీ, పోలీసు అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇందులో భాగంగానే ట్యాంక్‌బండ్‌పై నుంచి విగ్రహాలను నేరుగా సాగర్‌లో వేయకుండా 10 అడుగుల రైలింగ్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడ నిమజ్జనం నిషిద్ధమంటూ ఫ్లెక్సీలను కూడా పెట్టారు. అయితే, ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించింది. ఎన్టీఆర్ మార్గ్, పీపుల్స్ ప్లాజా, నెక్లెస్ రోడ్ ప్రాంతాల్లో మట్టి, పర్యావరణ హిత విగ్రహాల నిమజ్జనం కోసం క్రేన్లను సిద్ధం చేస్తున్నారు. పీఓపీ విగ్రహాల కోసం ప్రత్యేకంగా కృత్రిమ కొలనులను (బేబీ పాండ్స్) ఏర్పాటు చేస్తున్నారు. అయినప్పటికీ ఈ ఏర్పాట్లను భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ట్యాంక్‌బండ్ అనేది సంప్రదాయ నిమజ్జన ప్రాంతమని, అక్కడే కార్యక్రమానికి అనుమతించాలని డిమాండ్ చేస్తోంది. ప్రభుత్వం ఏర్పాట్లు చేయకపోతే తామే సొంతంగా క్రేన్లు తెచ్చి నిమజ్జనాలు చేస్తామని ఆదివారమే హెచ్చరించింది. మొత్తంమీద ఒకవైపు కోర్టు ఆదేశాలు, పర్యావరణ పరిరక్షణ నిబంధనలు, మరోవైపు సంప్రదాయం పేరుతో ఉత్సవ సమితి పట్టుదల మధ్య హైదరాబాద్ గణేశ్ నిమజ్జనం అంశం మరోసారి వివాదాస్పదంగా మారింది. ఈ ప్రతిష్ఠంభన ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందోనని నగరవాసుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

విద్యార్థుల నిరసనలకు కేంద్రబిందువుగా ఐఐటీ-బాంబే ప్రొఫెసర్..

ఐఐటీ-బాంబే విద్యార్థి సాహిల్ ఆత్మహత్య

పరీక్షలో చీటింగ్ చేస్తూ పట్టుబడటంతో ఘటన

ప్రొఫెసర్ సూర్యనారాయణ దూళ్లపై కుల వివక్ష, ఆత్మహత్య ప్రేరేపణ కేసు

ప్రొఫెసర్‌ను సస్పెండ్ చేయాలంటూ విద్యార్థుల ఆందోళన

స్వతంత్ర విచారణకు అంగీకరించిన ఐఐటీ డైరెక్టర్

దేశ అత్యున్నత విద్యాసంస్థల్లో ఒకటైన ఐఐటీ-బాంబే క్యాంపస్ ఇప్పుడు నిరసనలతో అట్టుడుకుతోంది. ఒక విద్యార్థి ఆత్మహత్య, దాని చుట్టూ అల్లుకున్న కుల వివక్ష ఆరోపణలు, ఈ వివాదానికి కేంద్రబిందువుగా నిలిచిన ఒక ప్రొఫెసర్.. ఇప్పుడీ పరిణామాలన్నీ దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీశాయి. విద్యార్థుల ఆందోళనలకు కారణమైన, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసును ఎదుర్కొంటున్న ఆ ప్రొఫెసర్ సూర్యనారాయణ దూళ్ల ఎవరు? ఆయన నేపథ్యం ఏమిటి? అసలు ఆ రోజు ఏం జరిగింది సూర్యనారాయణ దూళ్ల.. ఐఐటీ-బాంబేలోని ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్. విద్యుత్ వ్యవస్థల నియంత్రణ, పునరుత్పాదక ఇంధన వనరుల ఏకీకరణ వంటి అంశాల్లో నిపుణుడిగా ఆయనకు పేరుంది. అయితే, సెప్టెంబర్ 18న జరిగిన ఒక సంఘటన ఆయన వృత్తి జీవితాన్ని పెను వివాదంలోకి నెట్టింది. ఆ రోజు జరిగిన మిడ్-సెమిస్టర్ పరీక్షకు ప్రొఫెసర్ దూళ్ల ఇన్విజిలేటర్‌గా వ్యవహరించారు. ఆ సమయంలో, రెండో సంవత్సరం చదువుతున్న సాహిల్ వకోడ్ (20) అనే విద్యార్థి తన మొబైల్ ఫోన్‌లో చాట్‌జీపీటీ సాయంతో సమాధానాలు రాస్తూ పట్టుబడ్డాడు. నిబంధనల ప్రకారం ప్రొఫెసర్ దూళ్ల ఈ విషయాన్ని అకడమిక్ డిసిప్లినరీ కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. ఆ తర్వాత కొన్ని గంటలకే, సాహిల్ తన హాస్టల్ గదిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడటం క్యాంపస్‌ను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది.

ఘటనకు కుల వివక్ష కోణం

పరీక్షలో కాపీ కొడుతూ పట్టుబడటమే ఆత్మహత్యకు కారణమని ప్రాథమికంగా భావించినప్పటికీ, ఈ ఘటన అనూహ్య మలుపు తిరిగింది. సాహిల్ తండ్రి రవీంద్ర వకోడ్ ఇచ్చిన ఫిర్యాదుతో అసలు వివాదం మొదలైంది. తన కుమారుడు షెడ్యూల్డ్ కులానికి (ఎస్సీ) చెందినవాడని, గత మూడు నెలలుగా ప్రొఫెసర్ దూళ్ల అతడిని కులం పేరుతో తీవ్రంగా వేధిస్తున్నారని ఆయన ఆరోపించారు. "నువ్వు దిగువ కులం వాడివి, చదువుకోవడానికి అనర్హుడివి. నిన్ను ఏ కేసులోనైనా ఇరికించగలను" అంటూ ప్రొఫెసర్ దూళ్ల తన కొడుకును మానసికంగా హింసించారని, ఈ వేధింపులు భరించలేకే సాహిల్ ప్రాణం తీసుకున్నాడని తండ్రి తన ఫిర్యాదులో కన్నీటిపర్యంతమయ్యారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ప్రొఫెసర్ దూళ్లపై ఆత్మహత్యకు ప్రేరేపణ (ఇప్పుడు ... 306, ఇప్పుడు దీహా 108), ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ నివారణ చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కేసు తీవ్రత దృష్ట్యా విచారణను క్రైమ్ బ్రాంచ్‌కు అప్పగించారు.

భగ్గుమన్న విద్యార్థులు

ఈ ఘటనతో ఐఐటీ-బాంబేలో విద్యార్థులు భగ్గుమన్నారు. ప్రొఫెసర్ దూళ్లను తక్షణమే సస్పెండ్ చేయాలని, ఈ ఘటనపై ఒక స్వతంత్ర కమిటీతో పారదర్శక విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున నిరసన జ్వాలలు ఎగసిపడ్డాయి. మూడు రోజుల పాటు క్యాంపస్ మొత్తం ఆందోళనలతో దద్దరిల్లింది. విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని కాపాడటంలో, కుల వివక్షను అరికట్టడంలో యాజమాన్యం విఫలమైందని విద్యార్థి సంఘాలు తీవ్రంగా విమర్శించాయి. మరోవైపు, ప్రొఫెసర్ దూళ్లకు మద్దతుగా ఫ్యాకల్టీ ఫోరం ముందుకొచ్చింది. ఆయన కేవలం తన విధిని నిర్వర్తించారని, ఆయనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని పేర్కొంది. ఐఐటీ యాజమాన్యం కూడా తమకు గతంలో విద్యార్థి నుంచి ఎలాంటి కుల వివక్ష ఫిర్యాదు అందలేదని ప్రకటించింది. చివరకు, విద్యార్థుల ఆందోళనల తీవ్రతకు తలొగ్గిన ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ షిరీష్ కేదారే, వారు ప్రతిపాదించిన 18 డిమాండ్ల చార్టర్‌పై సంతకం చేశారు. దీంతో తాత్కాలికంగా ఆందోళనలు సద్దుమణిగాయి. ఒకవైపు విధి నిర్వహణలో భాగంగా తీసుకున్న చర్య అని ప్రొఫెసర్ వర్గం వాదిస్తుండగా, మరోవైపు కుల వివక్షతో కూడిన వేధింపులే తమ బిడ్డ ప్రాణం తీశాయని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈ ఏడాది ఐఐటీ-బాంబేలో ఇది మూడో విద్యార్థి ఆత్మహత్య కావడం అక్కడి విద్యా వాతావరణం, విద్యార్థుల మానసిక స్థితిపై తీవ్ర ఆందోళనలను రేకెత్తిస్తోంది.

ఎండాకాలం బూచి చూపి రైతులకు నీళ్లివ్వరా

పాలమూరు జిల్లాలోని జూరాల ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు తక్షణమే సాగునీటిని విడుదల చేసి ఎండిపోతున్న పంటలను కాపాడాలని బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంటలు ఎండిపోయి నీటి కోసం రైతాంగం అల్లాడుతుంటే, రాబోయే ఎండాకాలాన్ని బూచిగా చూపి కాలువలకు నీటిని నిలిపివేయడం ఏమాత్రం సమంజసం కాదని మండిపడ్డారు. జూరాల జలాశయంలో ప్రస్తుతం సరిపడా నీటి నిల్వలు ఉన్నాయని, కృష్ణా నదికి ఇంకా వరద వచ్చే అవకాశం కూడా ఉందని స్పష్టం చేశారు. ఒకవేళ వేసవిలో తాగునీటి ఎద్దడి వచ్చినా, ఎగువన కర్ణాటకలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వమే కాబట్టి అక్కడి నుంచి నీటిని తెప్పించుకునేందుకు చొరవ చూపవచ్చని డీకే అరుణ సూచించారు. జూరాల డ్యాం రోడ్డు, కలెక్టరేట్ ఎదుట రైతులు చేపట్టిన ఆందోళనలకు బీజేపీ పూర్తి మద్దతు ప్రకటిస్తుందని, రైతుల పోరాటానికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. నీటి కొరత తీవ్రతను వివరిస్తూ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడినట్లు వెల్లడించారు.

మార్కెట్‌పై వార్ ప్రభావం!

ట్రంప్ టారీఫ్‌ల బిల్లా కీలకమే మార్కెట్ పల్స్

స్టాక్ మార్కెట్లు నష్టాల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. పశ్చిమాసియా సంక్షోభంతో అమ్మకాల ఒత్తిడి తప్పడం లేదు. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో పోల్చితే గత వారం సెన్సెక్స్ 486.80 పాయింట్లు నష్టపోయి 74,294.96 దగ్గర ఆగింది. నిఫ్టీ 51.70 పాయింట్లు పడిపోయి 23,346.40 వద్ద నిలిచింది. ఈ నేపథ్యంలో ఈ వారం కూడా ఒడిదుడుకులకు వీలుందన్న అంచనాలు వినిపిస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ ముడి చమురు ధర 100 డాలర్లు దాటడం, సెంట్రల్ బ్యాంకుల వడ్డీరేట్ల పెంపు, రష్యా నుంచి చమురు కొంటున్న భారత్‌పై అమెరికా 100 శాతం సుంకాలు వేస్తామంటుండటం.. మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసే అంశాలే. ఇక చమురు, ఐటీ, బ్యాంకింగ్ తదితర రంగాల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనుకావచ్చు. డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ, విదేశీ మదుపర్ల పెట్టుబడులు, అంతర్జాతీయ మార్కెట్ల తీరుతెన్నులు, ఎల్ నినో సంబంధిత సమాచారం కూడా మార్కెట్ కదలికల్ని ప్రభావితం చేయగలవు. అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 23,100 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 22,900 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 23,700–23,900 పాయింట్ల స్థాయికి వెళ్లవచ్చునీ చెప్తున్నారు.

గమనిక..

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదుడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న వివరాలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.

మళ్లీ వస్తున్న అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్.. ఎప్పటి నుంచో తెలుసా..?

పండగ సీజన్ సమీపిస్తుండటంతో ఆన్‌లైన్ షాపింగ్ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న "అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ 2026 రాబోతోంది. ఫెస్ట్‌కు సంబంధించిన తేదీలను ఆ సంస్థ అధికారికంగా ప్రకటించింది. ఈ ఏడాది అతిపెద్ద సేల్‌గా అభివర్ణిస్తున్న ఈ ఫెస్టివల్ అక్టోబర్ 8 నుంచి ప్రారంభం కానుంది. మరో ఈ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ తన "బిగ్ బిలియన్ డేస్ 2026" సేల్‌ను అక్టోబర్ 9న ప్రారంభించనున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో, అమెజాన్ వ్యూహాత్మకంగా ఒకరోజు ముందే తన సేల్‌ను మొదలుపెట్టి పోటీకి సై అంటోంది. ఈ సేల్‌లో భాగంగా ఎస్‌బీఐ డెబిట్, క్రెడిట్ కార్డులతో కొనుగోళ్లు చేసేవారికి 10% తక్షణ డిస్కౌంట్ లభించనుంది. ఈఎంఐ లావాదేవీలకు కూడా ఈ ఆఫర్ వర్తిస్తుందని అమెజాన్ స్పష్టంచేసింది. ప్రైమ్ మెంబర్లకు కొన్ని ఎంపిక చేసిన ఆఫర్లపై అదనంగా 10% వరకు ప్రయోజనాలు ఉండనున్నాయి. వీటితోపాటు స్మార్ట్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్స్, ఫ్యాషన్, గృహోపకరణాలు, నిత్యావసరాలు వంటి అన్ని కేటగిరీలపై భారీ డిస్కౌంట్లు అందుబాటులో ఉంటాయి. బ్లాక్‌బస్టర్ డీల్స్, టాప్ 100 డీల్స్, మెగా డీల్స్, రాత్రి 8 గంటల డీల్స్ వంటి ప్రత్యేక ఆఫర్లతో వినియోగదారులను ఆకట్టుకునేందుకు అమెజాన్ సిద్ధమైంది. కేవలం డిస్కౌంట్లే కాకుండా ఈసారి షాపింగ్ అనుభవాన్ని మెరుగుపరిచేందుకు అమెజాన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత ఫీచర్లను ప్రవేశపెడుతోంది. వీటి ద్వారా వినియోగదారులు ఉత్పత్తులను సులభంగా పోల్చుకోవచ్చు, ధరల హెచ్చుతగ్గుల చరిత్రను చూడవచ్చు, మెరుగైన సిఫార్సులను పొందవచ్చు. దేశవ్యాప్తంగా వేగవంతమైన డెలివరీని అందించే లక్ష్యంతో తన లాజిస్టిక్స్ నెట్‌వర్క్‌ను భారీగా విస్తరించింది. ఇందులో భాగంగా 20 కొత్త ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్లు, 6 కొత్త సార్ట్ సెంటర్లు, 150 కొత్త లాస్ట్-మైల్ స్టేషన్లను ఏర్పాటు చేసింది. దీపావళి నాటికి "అమెజాన్ నౌ" (నిత్యావసరాల క్విక్ కామర్స్) సేవలను 100 నగరాలకు విస్తరించాలని అమెజాన్ లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం తమ ప్లాట్‌ఫామ్‌పై 17 లక్షల మందికి పైగా విక్రయదారులు ఉన్నారని, వీరి సంఖ్య 20 లక్షల మైలురాయిని దాటిందని కంపెనీ పేర్కొన్నది. సేల్ ఎప్పటివరకు కొనసాగుతుందనే విషయం ఇంకా వెల్లడి కాలేదు.

దుబాయ్‌లో ఐఫోన్ చౌక.. టికెట్, వీసా వ్యయం కలిపి చూస్తే లాభదాయకమేనా?

దుబాయ్‌లో ఐఫోన్ 18 ప్రో ధర సుమారు రూ.1.33 లక్షలు

భారత్‌లో అదే మోడల్ ధర రూ.1,64,900

ప్రో మ్యాక్స్ దుబాయ్ ధర సుమారు రూ.1.43 లక్షలు

భారత్‌లో ప్రో మ్యాక్స్ ప్రారంభ ధర రూ.1,79,900

ప్రయాణ, కస్టమ్స్ ఖర్చులతోనే తేలనున్న అసలు ఆదా లెక్క

ఐఫోన్ అంటే చాలామందికి క్రేజ్. కొత్త మోడల్ మార్కెట్లోకి వచ్చిందంటే ధర ఎంతైనా సరే కొనాలనుకునేవారు ఉంటారు. అయితే ఈసారి కొందరు భారతీయులు మరో అడుగు ముందుకేశారు. ఐఫోన్ 18 ప్రో, 18 ప్రో మ్యాక్స్ కొనుగోలు కోసం ఏకంగా దుబాయ్ వెళుతున్నారు. కారణం.. భారత్‌తో పోలిస్తే అక్కడ కనిపిస్తున్న ధర వ్యత్యాసం. ప్రయాణ ఖర్చులు, వీసా వ్యయం కలిపినా లెక్క కలిసొస్తుందా? అన్నదే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

దుబాయ్‌లో ఎంత తక్కువ?

యూఏఈలో ఐఫోన్ 18 ప్రో 256జీబీ ధర 5,099 దిర్హామ్‌లు. ప్రస్తుత మారకం విలువ ప్రకారం ఇది సుమారు రూ.1.33 లక్షలు. భారత్‌లో ఇదే మోడల్ ప్రారంభ ధర రూ.1,64,900. అంటే దాదాపు రూ.31,900 వ్యత్యాసం ఉంది. ఐఫోన్ 18 ప్రో మ్యాక్స్ 256జీబీ యూఏఈ ధర 5,499 దిర్హామ్‌లు. భారత కరెన్సీలో ఇది సుమారు రూ.1.43 లక్షలు. భారత్‌లో ప్రారంభ ధర రూ.1,79,900. అంటే దాదాపు రూ.36,500 తేడా కనిపిస్తోంది.

ప్రయాణంతో కలిపితే లెక్క ఎలా?

దుబాయ్‌లో ఐఫోన్ ధర తక్కువగా కనిపించినంత మాత్రాన డబ్బు ఆదా అవుతుందని కాదు. విమాన టికెట్, వీసా, అక్కడి వసతి, ఇతర ప్రయాణ ఖర్చులను కూడా లెక్కలోకి తీసుకోవాలి. అందుకే ప్రత్యేకంగా ఒక్క ఐఫోన్ కొనడం కోసమే దుబాయ్ వెళ్లడం వల్ల పెద్దగా ప్రయోజనం ఉండకపోవచ్చని కొనుగోలుదారులు చెబుతున్నారు. ఇప్పటికే దుబాయ్‌లో ఏదైనా పని ఉంటే.. లేదా కుటుంబాన్ని కలవడానికి, సెలవుల కోసం అక్కడికి వెళ్లే ప్లాన్ ఉంటే.. అదే ట్రిప్‌లో ఐఫోన్ కొనడం వల్ల లెక్క అనుకూలంగా మారొచ్చు. అలాగే ఒకేసారి రెండు, మూడు ఫోన్లు కొనుగోలు చేస్తే ధరలో ఉన్న వ్యత్యాసం వల్ల ప్రయాణ ఖర్చును కొంతవరకు భర్తీ చేసుకునే అవకాశం ఉంటుంది. కేరళకు చెందిన మహమ్మద్ సయీద్ కుటుంబాన్ని కలిసేందుకు దుబాయ్ వెళ్లారు. భారత్, యూఏఈ ధరలను పోల్చిన తర్వాత అక్కడే ఐఫోన్ 18 ప్రో మ్యాక్స్ కొనుగోలు చేశారు. తనకు సుమారు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు ఆదా అవుతోందని ఆయన గల్ఫ్ న్యూస్‌తో చెప్పారు. అందుకే 'దుబాయ్‌లో ఐఫోన్ చౌక.. కాబట్టి అక్కడికే వెళ్లి కొనాలి' అనే లెక్క కంటే.. మొత్తం ట్రిప్ ఖర్చు ఎంత? ఇప్పటికే దుబాయ్ వెళ్లే పని ఉందా? ఎన్ని ఫోన్లు కొనుగోలు చేస్తున్నాం? అనే అంశాలను కలిపి చూసినప్పుడే నిజమైన ఆదా ఎంత అనేది తెలుస్తుంది.

దుబాయ్‌లో ఎందుకు చౌక?

ధరల్లో తేడాకు పన్నులు ప్రధాన కారణాల్లో ఒకటి. యూఏఈలో 5 శాతం వ్యాట్ ఉంది. భారత్‌లో స్మార్ట్‌ఫోన్లపై పన్నులు, దిగుమతి సుంకాలు భిన్నంగా ఉంటాయి. దీంతో ఖరీదైన ఫోన్ల విషయంలో ధర వ్యత్యాసం వేల రూపాయలకు చేరుతోంది. అయితే విదేశాల నుంచి ఖరీదైన ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకొచ్చేటప్పుడు కస్టమ్స్ నిబంధనలు, వర్తించే పరిమితులను తప్పక పరిగణనలోకి తీసుకోవాలి.

మలేసియా ధర కూడా ఆసక్తికరమే

దుబాయ్‌తో పాటు ఆగ్నేయాసియా మార్కెట్లలోనూ ధరల్లో తేడా కనిపిస్తోంది. 256జీబీ ఐఫోన్ 18 ప్రో మలేసియాలో 5,499 రింగిట్‌లు. ఇది సుమారు రూ.1.29 లక్షలు. థాయ్‌లాండ్‌లో 48,900 బాత్‌లు.. అంటే దాదాపు రూ.1.41 లక్షలు. సింగపూర్‌లో 1,899 సింగపూర్ డాలర్లు.. సుమారు రూ.1.43 లక్షలు. వియత్నాంలో 3.8999 కోట్ల డాంగ్‌లు.. సుమారు రూ.1.44 లక్షలు. ఫిలిప్పీన్స్‌లో 94,990 పెసోలు.. దాదాపు రూ.1.45 లక్షలు. అందుకే విదేశాల్లో ఐఫోన్ కొనాలనుకునేవారు ఫోన్ ధర ఒక్కటే కాకుండా విమాన టికెట్, వసతి, వీసా, కస్టమ్స్ నిబంధనలు వంటి అన్ని ఖర్చులనూ కలిపి లెక్కించాలి. అప్పుడే నిజంగా ఎంత ఆదా అవుతుందో స్పష్టమవుతుంది.

లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు!

సోమవారం ఉదయం లాభాల్లో ప్రారంభమైన.. దేశీయ స్టాక్ మార్కెట్లు, ట్రేడింగ్ క్లోజ్ అయ్యే సమయానికి భారీ లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 599.90 పాయింట్లు లేదా 0.81 శాతం లాభంతో 74,894.86 వద్ద, నిఫ్టీ 82.60 పాయింట్లు లేదా 0.35 శాతం లాభంతో 23,429.00 వద్ద నిలిచాయి. పతంజలి ఫుడ్స్ లిమిటెడ్, ఇంజనీర్స్ ఇండియా లిమిటెడ్, జ్యోతి సిఎన్‌సి ఆటోమేషన్ లిమిటెడ్ వంటి కంపెనీలు టాప్ గెయినర్స్ జాబితాలో చేరాయి. ఒరాకిల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సాఫ్ట్‌వేర్ లిమిటెడ్, వర్ధమాన్ టెక్స్‌టైల్స్ లిమిటెడ్, ఏపీఎల్ అపోలో ట్యూబ్స్ లిమిటెడ్ వంటి సంస్థలు నష్టాల జాబితాలో నిలిచాయి.

డీసీసీ బ్యాంక్ బోర్డుపై ఆర్‌బీఐ వేటు

లాతూర్ జిల్లా సెంట్రల్ సహకార బ్యాంకు (డీసీసీబీ) బోర్డు డైరెక్టర్లుగా పదేళ్ల కాలపరిమితి దాటిన వారిని వెంటనే తొలగించాలని ఆర్‌బీఐ సంచలన ఉత్తర్వులు జారీ చేసింది. మహారాష్ట్ర సహకార శాఖ మంత్రి, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ) నాయకుడు బాబాసాహెబ్ పాటిల్‌తో పాటు మరో ఏడుగురు డైరెక్టర్లు తమ పదవులకు అనర్హులని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. బ్యాంకింగ్ రెగ్యులేషన్ యాక్ట్ 1949 (సవరణ చట్టం 2025)లోని సెక్షన్ 10ఎ(2ఎ)(ఐ), సెక్షన్ 56 నిబంధనల ప్రకారం డీసీసీ బ్యాంకుల డైరెక్టర్ల గరిష్ట పదవీకాలం 10 ఏళ్లకు మించకూడదు. ఈ వ్యవహారంపై బ్యాంకు సభ్యుడు సతీష్ శేషరావు జాధవ్ దాఖలు చేసిన పిటిషన్‌పై బాంబే హైకోర్టు (ఔరంగబాద్ బెంచ్) కీలక ఆదేశాలు ఇచ్చింది. ఆ ఆదేశాల మేరకు ఆర్‌బీఐ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ కపిల్ గోస్వామి ఈ అధికారిక ఉత్తర్వులను విడుదల చేశారు. మే 25, 2026: నిబంధనలు ఉల్లంఘించి 10 ఏళ్లకు పైగా కొనసాగుతున్న 8 మంది డైరెక్టర్లపై చర్యలు తీసుకోవాలని సతీష్ జాధవ్ ఆర్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్‌కు ఫిర్యాదు చేశారు.

'ఆదర్శ కుటుంబం' నుంచి 'నారాయణమ్మ' ఫస్ట్ సింగిల్ అప్‌డేట్!

విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఆదర్శ కుటుంబం' సినిమా నుంచి మేకర్స్ ఒక క్రేజీ అప్‌డేట్ ఇచ్చారు. ఈ సినిమాలోని మొదటి పాటైన 'నారాయణమ్మ' సాంగ్‌ను సెప్టెంబర్ 22న విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఎస్. థమన్ సంగీతం అందిస్తున్న ఈ పాటపై ప్రేక్షకుల్లో మరియు అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో విక్టరీ వెంకటేష్ సరసన శ్రీనిధి శెట్టి, నివేతా థామస్, డింపుల్ హయతి తదితరులు నటిస్తున్నారు. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించిన ఈ మాస్ అండ్ ఎంటర్‌టైనింగ్ సాంగ్ ఆదిత్య మ్యూజిక్ ద్వారా విడుదలవుతోంది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసుకుని ఈ సినిమా అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది.

థియేటర్లు మొత్తం ఊగిపోతాయి

'మనం అంకితభావంతో కష్టపడి పనిచేస్తుంటే మన చుట్టూ గెలవాలని కోరుకునే వారు పెరిగినట్లే..ఓడిపోతే చూద్దామనుకునే వాళ్లు కూడా పెరిగిపోతారు. ఓడిపోతే చూద్దామనుకునే వాళ్లను ఓడించడానికి నేను ఎప్పుడూ ప్రయత్నించను. కానీ..నేను గెలుస్తానని నమ్మేవాళ్లను గెలిపించడానికి కష్టపడుతూనే ఉంటా' అన్నారు నాని. ఆయన తాజా చిత్రం 'ది ప్యారడైజ్' ఈ నెల 24న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని నిర్మించారు. కయాదులోహర్ కథానాయిక. సోమవారం హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ పైవిధంగా స్పందించారు. ఇంకా ఆయన చెబుతూ 'అభిమానులు నాకు వందేళ్లకు సరిపడా ప్రేమనిచ్చారు. ఇక మనల్ని ఎవరూ ఆపలేరు. 23వ తేది రాత్రి నుంచే థియేటర్లు మొత్తం ఊగిపోతాయి' అన్నారు. నిర్మాత సుధాకర్ చెరుకూరి మాట్లాడుతూ ..బొమ్మ బ్లాక్‌బస్టర్ హిట్ అనే నమ్మకం ఉందని, ఈ సినిమాకు అద్భుతమైన టీమ్ కుదిరిందన్నారు. తన హృదయానికి దగ్గరైన చిత్రమిదని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల రూపంలో తనకు ఓ సోదరుడు దొరికాడని, ఎక్కడకు వెళ్లినా ప్యారడైజ్ పాటలే వినిపిస్తున్నాయని సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ వీడియో సందేశంలో ఆనందం వ్యక్తం చేశారు.కొత్త సినిమాలు చూడండి

'ఫౌజీ' వాయిదా

ప్రభాస్ కథానాయకుడిగా హను రాఘువపూడి దర్శకత్వంలో రూపొందుతున్న 'ఫౌజీ' చిత్రం డిసెంబర్ 3న రావాల్సి ఉంది. అయితే ఈ చిత్ర రిలీజ్‌ను వాయిదా వేస్తున్నట్లు 'ది ప్యారడైజ్' ప్రీరిలీజ్ వేడుకలో నిర్మాత వై.రవిశంకర్ తెలిపారు. త్వరలోనే కొత్త విడుదల తేదీని ప్రకటిస్తామని ఆయన అన్నారు.



కార్తికేయ 'కమ్‌బ్యాక్'

రెండేళ్ల విరామం తర్వాత హీరో కార్తికేయ నటిస్తున్న తాజా చిత్రం 'కమ్‌బ్యాక్'. విశేషమేమిటంటే ఈ సినిమా ద్వారా ఆయన దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. సోమవారం కార్తికేయ పుట్టిన రోజు సందర్భంగా ఈ సినిమాను ప్రకటిస్తూ స్పెషల్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. కార్తికేయ క్రియేటివ్ వర్క్స్ పతాకంపై రూపొందిస్తున్న ఈ చిత్రానికి ఆయన సతీమణి లోహితా రెడ్డి నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. 'మూడేళ్ల నుంచి ఏమైపోయాడో తెలియలేదు. ఇన్ని రోజులు ఏం చేస్తున్నాడు? అనే వాయిస్ ఓవర్‌తో మొదలైన గ్లింప్స్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. ఇందులో హీరో కార్తికేయ బాక్సర్‌గా కనిపించారు. ఈ చిత్రానికి కెమెరా: జగదీశ్ చీకటి, సంగీతం: విజయ్ బుల్గానిన్, దర్శకత్వం: కార్తికేయ గుమ్మకొండ.

ఫోన్లు పక్కనపెట్టి మాట్లాడుకోండి..

నేటి డిజిటల్ యుగంలో సోషల్ మీడియా, స్మార్ట్‌ఫోన్ల ప్రభావం మనుషుల మధ్య బంధాలపై కూడా పడుతోందని నటి కాజల్ అగర్వాల్ అభిప్రాయపడింది. ముఖ్యంగా భార్యాభర్తలు ఒకరితో ఒకరు మాట్లాడుకునేందుకు కూడా తగినంత సమయం కేటాయించకపోవడం ఆందోళన కలిగించే విషయమని ఆమె పేర్కొంది. కలిసి బయటకు వెళ్లిన సమయంలోనూ ఫోన్లలో మునిగిపోవడం వల్ల బంధాల్లో కమ్యూనికేషన్ తగ్గిపోతోందని చెప్పింది. కాజల్ అగర్వాల్ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విషయాలను కూడా ఈ సందర్భంగా పంచుకుంది. తన భర్త గౌతమ్ కిచ్లూతో కలిసి ప్రతి వారం కనీసం ఒకరోజు డిన్నర్‌కు బయటకు వెళ్తామని ఆమె తెలిపింది. ఆ సమయంలో ఇద్దరం ఫోన్లను పక్కన పెట్టి కేవలం ఒకరితో ఒకరు మాట్లాడుకోవడానికి, కలిసి సమయం గడపడానికి ప్రాధాన్యత ఇస్తామని చెప్పింది. ప్రస్తుతం చాలా మంది జంటలు కలిసి ఉన్నప్పటికీ ఒకరితో ఒకరు మాట్లాడుకోవడానికి సమయం కేటాయించడం లేదని కాజల్ పేర్కొంది. డిన్నర్ డేట్‌కు వెళ్లినా చేతిలో ఫోన్ పట్టుకుని సోషల్ మీడియా చూస్తూ ఉండటం వల్ల పక్కనే ఉన్న వ్యక్తితోనే దూరం పెరుగుతోందని ఆమె అభిప్రాయపడింది. భార్యాభర్తల మధ్య మంచి అనుబంధం కొనసాగాలంటే ఒకరి అభిప్రాయాలను మరొకరు వినడం, మాట్లాడుకోవడం చాలా ముఖ్యమని కాజల్ సూచించింది. ఎంత బిజీగా ఉన్నప్పటికీ భాగస్వామితో కొంత సమయం గడపడం, తమ ఆలోచనలు, అనుభవాలను పంచుకోవడం అవసరమని చెప్పింది. తన వివాహ బంధంలో తాము పాటిస్తున్న ఈ విధానం గురించి చెబుతూ.. వారానికి ఒకరోజు ఫోన్‌లకు దూరంగా కలిసి సమయం గడపడం తమకు ఉపయోగపడుతోందని కాజల్ వెల్లడించింది. డిజిటల్ ప్రపంచంలో నిరంతరం గడపడం కంటే నిజ జీవితంలో మన చుట్టూ ఉన్న వ్యక్తులతో మాట్లాడటం, వారి మాటలు వినడం ముఖ్యమనే సందేశాన్ని ఆమె ఇచ్చింది. కాజల్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చకు దారితీశాయి. సెలబ్రిటీల వ్యక్తిగత జీవితాలతో పాటు సాధారణ కుటుంబాల్లోనూ స్మార్ట్‌ఫోన్లు, సోషల్ మీడియా వినియోగం పెరిగిన నేపథ్యంలో ఆమె చెప్పిన మాటలు ఆసక్తిని కలిగిస్తున్నాయి.ఇదిలా ఉంటే.. కాజల్ అగర్వాల్ ప్రస్తుతం సినిమాలతో బిజీగా ఉంది. ఆమె నటించిన 'ది ఇండియా స్టోరీ' చిత్రం ఇటీవల ఓటీటీలోకి అందుబాటులోకి వచ్చింది. ఈ సినిమాలో కాజల్ న్యాయవాది పాత్రలో కనిపించింది. ఆహార కల్తీ, వ్యవసాయంలో పురుగుమందుల వినియోగం వంటి అంశాల చుట్టూ ఈ సినిమా కథ కొనసాగుతుంది.

ఆ మ్యాజిక్ రిపీట్

'బ్లాక్‌బస్టర్ 'డీజే టిల్లు' తర్వాత దర్శకుడు విమల్‌కృష్ణ చేస్తున్న సినిమా ఇది. అంతపెద్ద హిట్ తర్వాత ఆయనకు పెద్ద హీరో దొరకుతాడు. కానీ ఆయన నాపై నమ్మకంతో ఈ సినిమా చేశారు. తొలికాపీ చూసుకున్న తర్వాత ఆయన నమ్మకాన్ని నిలబెట్టాననే సంతృప్తి కలిగింది' అని హీరో రాగ్ మయూర్ అన్నారు. ఆయన కథానాయకుడిగా రూపొందిన కామెడీ థ్రిల్లర్ 'అనుమాన పక్షి'. 'డీజే టిల్లు'ఫేం విమల్ కృష్ణ దర్శకుడు. రాజీవ్ చిలక, రాజేశ్ జగ్తియాని, హిరాచంద్ దండ్ నిర్మాతలు. ఈ నెల 25న సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా రాగ్ మయూర్ సోమవారం విలేకరులతో మాట్లాడారు. 'విమల్‌కృష్ణ ట్రెండ్ ఫాలోకారు. 'డీజే టిల్లు' పార్ట్ 2 కూడా ఆయన అందుకే చేయలేదు. 'అనుమాన పక్షి' పూర్తి భిన్నమైన సినిమా. కాకపోతే ఇదికూడా 'డీజే టిల్లు' లాంటి ఇంపాక్ట్ క్రియేట్ చేస్తుంది. డీజే టిల్లు, జాతిరత్నాలు ఊహించని విజయాలు సాధించాయి. ఈ సినిమా కూడా అలాంటి మ్యాజిక్కే చేస్తుందని నా నమ్మకం' అని ఆశాభావం వెలిబుచ్చారు రాగ్‌మయూర్. 'వినోదంతో మొదలై, మిస్టరీ జానర్‌లోకి ఎంటరై హారర్, థ్రిల్లర్ అంశాలతో ఈ సినిమా సాగుతుంది. ఇందులో హీరో తన అనుమానాలతో అందర్నీ పిచ్చెక్కిస్తుంటాడు. ఇంతమంచి పాత్ర ఇచ్చిన విమల్‌కృష్ణకు థ్యాంక్స్' అని తెలిపారు రాగ్ మయూర్.

Printed, Published And Owned by **YAMJALA PRAVEEN**, Printed at **SRI VENKATESWARA PRINTING SOLUTIONS** 11-1/B/42, BPM Green Lands Colony, Shabari Gardens Back, Parvathapur, Medipally Mandal, Peerzadiguda, GHMC, Medchal Malkajgiri, Telangana - 500098. Published from 4-33, Near Hanuman Temple, Allapur Village, Choutuppal Mandal, Yadadri Bhuvanagiri, Telangana - 508252. **Editor : YAMJALA PRAVEEN, PRGI No: TGTEL/26/A6221,** Ph. No: 9491134365. Email id: praveenyamjala1@gmail.com, Website: www.tholivelugu.com